నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

పేదకు అండ
బస్తీ దవాకానాలు
నామ్కే యా కామ్కే

గులాబీ పూలు
మొగలి పూరేకులు
జాగ్రత్త నేస్తం.

ప్రాణం ఖరీదు
మైకం మోజు ప్రయాణం
సీసా ముక్కలు.

మంచి పథకం
లోప భూయిష్టామెనూ
బడి భోజనం.

కోతికి కొమ్మ
పాపకు లాలిజోల
తాగుబోతుకు?



\- రేడియమ్
సెల్: 9291527757

# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

అయ్యా! కాపాడండోయ్
ప్రాంతం అస్తిత్వాలను
చెవులారా! వినరండోయ్
మనుషుల్లో మనస్తత్వాలను

నిలబెట్టుడు మనదేశపు
భిన్నత్వం విలువ !
కొలువు దీర్చి భరత వనిత
వొలువ వద్దు వలువ !

**శ్రీనిజాలు**



\- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245
నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

హైదరాబాద్ | గురువారం 30-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 122 | పేజీలు:6 | వెల: రూ.1/-

## నిప్పురవ్వలు



కళ్ళల్లో
ఒత్తులు వేసుకొని
పుత్తడి వసంతాల్ని
కలగానే కన్నా-
కండల్లో కొవ్వుని కరిగించు-
నీ సంతృప్తికై జీవించు!



గుండెకు
గుండెకు ఉన్న
ప్రేమబంధాల్ని
తెంపకు-
తెగినదారమో
వేసిన ముడులో
'గుర్తుం"డిపోతాయి!



గుండె
బాధతో తడిసి
బరువైనప్పుడు-
కన్నీళ్లు పిండై!
బ్రతుకు
ప్రేమను విడిచి
దూరమైనప్పుడు-
ప్రేమ గరళాన్ని మ్రింగెయ్!!



మౌనంగా నువ్వు
మాట్లాడుతున్నప్పుడు
చిరునవ్వుతో
నే పలకరించాను-
తెలియని బాధతో
నువు నను విడిపోతున్నప్పుడు-
నా గుండె బరువెక్కినదని
ప్రేమతో తెలిపాను-
నీమది గదితో చోటిచ్చావు!
నీలో నేను మమేకమయ్యాను!!



\- డా॥ విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

# 'మోడరన్ టాయిలెట్'లను ప్రారంభించిన మంత్రి తలసాని



హైదరాబాద్, డిసెంబర్ 29:స్వచ్ఛ్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం GHMC ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మొండా మార్కెట్ డివిజన్ లో నూతనంగా నిర్మించిన మోడరన్ టాయిలెట్ ను ఆయన ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయకుండా నివారించేందుకు GHMC ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో 1,950 టాయిలెట్ లను నిర్మిచామన్నారు.

వీటిలో 352 టాయిలెట్ ల నిర్వహణ ను బౌ పద్ధతిలో అప్పగించామని చెప్పారు. మొండా మార్కెట్ డివిజన్ లో నేడు 353 వ మోడరన్ టాయిలెట్ ను ప్రారంభించారు, ఓల్డ్ జైలు ఖానా వద్ద మరో మోడరన్ టాయిలెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ మోడరన్ టాయిలెట్ ల నిర్వహణ బాధ్యత చేపట్టిన వారు టాయిలెట్ లను వినియోగించే వారి వద్ద నుండి సాధారణ రుసుము ను నిర్వహణ నిమిత్తం వసూలు చేస్తారని తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని, GHMC సిబ్బందికి సహకరిస్తూ పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాల లో భాగస్వాములు కావాలని కోరారు. స్వచ్ఛ్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 4500 స్వచ్ఛ్ ఆటోలను ఏర్పాటు చేసి, ఇంటింటికి వెళ్ళి చెత్తను సేకరిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

GHMC ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న కారణంగా కేంద్ర ప్రభుత్వం పలు అవార్డ్ లను అందజేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆఆ ముకుందరెడ్డి, ఇఇ సుదర్శన్, వాటర్ వర్క్స్ ఉఓ రమణారెడ్డి, టౌన్ ప్లానింగ్ ంఅఖ క్రిస్టోఫర్, కార్పొరేటర్ దీపిక, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.

# రెండు వేలకి చేరువలో కరోనా కేసులు .. ముందస్తు చర్యలు చేపట్టండి - మంత్రి 'ఆదిత్యఠాక్రే'

ముంబయి, డిసెంబర్ 29:ముంబయిలో ఆసుపత్రి మౌలిక సదుపాయాలు పెంచి, మందులు, ఆక్సిజన్ ని ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుంది. పెద్దలు, పిల్లలకు టీకాలు వేయడంపై ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఈ మేరకు అధికారులతో సమావేశమయ్యారు మహారాష్ట్ర మంత్రి ఆదిత్యఠాక్రే. కరోనా కేసులు నిన్న 70శాతం ఉండగా, నేడు 2వేలకి చేరనున్నాయన్నారు. 15నుండి 18ఏళ్ళ వయసు వారికి టీకాని జనవరిలో ఇవ్వనున్నట్టు ట్వీట్ చేశారు. రాబోయే 48 గంటల్లో, 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల వారందరికీ టీకా డ్రైవ్‌ను నిర్వహించేందుకు నగరంలోని అన్ని విద్యాసంస్థలతో కనెక్ట్ అవుతుందని మంత్రి మరో ట్వీట్‌లో తెలిపారు. జంబో కోవిడ్ కేర్ సెంటర్‌లు "మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రాథమిక సౌకర్యాలతో పాటు అన్ని సంసిద్ధత స్థాయిలలో'' స్టాండ్‌బైలో ఉండాలని చెప్పారు.

న్యూఇయర్ వేడుకలపై మాట్లాడారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముంబైలో నిన్న 24గంటల వ్యవధిలో 1,377 కోవిడ్ కేసులు నమోదయ్యాయి.నగరంలో స్పైక్ రేటు చాలా ఎక్కువగా ఉంది, డిసెంబర్ 8 నుండి మూడు వారాల్లో కేసులు 188 శాతం ఎక్కువగా నమోదయ్యాయి. మహారాష్ట్ర ఆరోగ్య మంత్రి రాజేష్ తోపే తాజా కేసుల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది "ఆందోళనకరమైన పరిస్థితి" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసుల సంఖ్య రెట్టింపు కావడం, ముంబైలో పెరుగుతున్న ఇన్‌ఫెక్షన్ల సంఖ్య నేటు 2,200 దాటవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలంతా మాస్క్ లు ధరించాలని తెలిపారు.

# రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:ప్రధాని నరేంద్ర మోడీ రానున్న కొత్త సంవత్సరం కానుకగా గుడ్ న్యూస్ చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా.. అంటే జనవరి 1వ తేదీన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

ఇప్పటి వరకు తొమ్మిది విడతల్లో.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను విడుదల చేసినట్లు, జనవరి 1వ తేదీ నుంచి పదో విడత డబ్బులు కూడా విడుదల చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి కోసం ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతోనే ఈ స్కీమ్ ని తీసుకు వచ్చారు.

కాగా ఈ పథకం కింద కేంద్రం ఏటా రైతుల ఖాతాల్లో మూడు విడతలుగా ఆరు వేల రూపాయలు జమ చేస్తోంది. దీనివల్ల దేశ వ్యాప్తంగా 12కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఇక ఈ పథకం డబ్బులను ష్టబిబిజూబ://జూఎనితిబష్ట్రజీని.ఇనీల.తిని/ వెబ్ సైట్ ద్వారా చూసుకోవచ్చని కేంద్రం తెలిపింది.

# ప్రతీ ఒక్కరికీ రైతు బంధు: మంత్రి గంగుల



కరీంనగర్ డిసెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి): రైతులకు ఇచ్చిన మాట తప్పని సీఎం కేసీఆర్ అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రైతుల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రైతుబంధు నిధులను ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా బుధవారం కరీంనగర్ లోని గోపాలపూర్ లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ రాబడులు తగ్గి ఇబ్బంది నెలకొన్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపలేదన్నారు. కళ్యాణలక్ష్మి, ఆసరా ఫించన్లు, ఉచిత కరెంటు, రైతుబంధు వంటివి నిరంతరాయంగా అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది వడ్లు వేసేవాళ్లకు రైతుబంధు రాదనే విష ప్రచారాన్ని ప్రతిపక్షాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో గతంలో మాదిరిగానే ప్రతీ ఒక్కరికీ రైతు బంధుని అందజేస్తుందన్నారు,కేంద్రం వరిపంటపై అవలంభిస్తున్న వైఖరితో వ్యవసాయ శాఖ సైతం వరికి రైతుబంధుపై సంశయాలు వ్యక్తం చేసిందన్నారు. అయితే, ముఖ్యమంత్రి రైతులకు ఇబ్బంది కలుగనీయవద్దని ఆదేశాలు జారీచేసారన్నారు. అర్హులైన అందరికీ రైతు బంధు అందుతుందని స్పష్టం చేశారు. ఈ యాసంగిలో రైతులు ఇష్టమైన పంట వేసుకోవడానికి అనుమతి ఉందన్నారు. అయితే యాసంగిలో కేంద్రం వరి వేయొద్దని, కొనమని చెప్పడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఉండవన్నారు. మిల్లర్లతో, ఇతరత్రా ఒప్పందాలు ఉన్నవాళ్లు సొంత ఏర్పాట్లతో వేసుకోవాలని సూచించారు.

# పురాతన ఆలయాల అభివృద్ధికి పెద్ద పీట : మంత్రి మల్లారెడ్డి



రంగారెడ్డి, డిసెంబర్ 29తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ పురాతన ఆలయాల అభివృద్ధికి పేద్ద పీఠ వేస్తున్నాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. ఈరోజుపోచారం మున్సిపల్ పరిధిలోని యంనం పెట్ శ్రీ బునిలసమేత గోదా రంగనాథ స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యంనం పెట్ శ్రీ బునిలసమేత గోదా రంగనాథ స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థాన ఛైర్మన్ గా పొలాగోని రాజేశ్ గౌడ్, డైరెక్టర్ లు గా సగ్గు రవిందర్, రగుల నరేందర్, నల్ల రాళ్ళ నిర్మల చంద్ర రెడ్డి, లక్ష్మణ్ నాయక్ లకు నియామక పత్రాలను అందజేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ? ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ ఛైర్మన్ రెడ్యా నాయక్, జిల్లా ఎండోమెంట్ అధికారిణి భాగ్యలక్ష్మి, కమిషనర్ సురేష్, ఘట్కేసర్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు నర్రి ధనలక్ష్మి, గొంగళ్ల మహేష్, సింగిరెడ్డి సాయి రెడ్డి, అకిటి శైలజ, సర్వీ సుధ లక్ష్మి, ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్మెన్ పావని, నాయకులు చామకూర భద్ర రెడ్డి ,పోచారం మున్సిపల్ తెరాస పార్టీ అధ్యక్షులు మందడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, గొంగళ్ల స్వామి నర్రి కాశయ్య, బద్దం జగన్ మోహన్ రెడ్డి, అకిటి బల్ రెడ్డి, మోటుపల్లి శ్రీనివాస్, బొక్క బుచ్చి రెడ్డి కో అప్షన్ సభ్యులు అక్రమ్, నల్లవెల్లి మురళి, రాఘవేంద్ర రెడ్డి, శశిధర్ రెడ్డి, గండి పల్లి శేఖర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ బస్ పాస్‌ల కాల పరిమితి మరో 3నెలలు పొడిగింపు

హైదరాబాద్, డిసెంబర్ 29:2022 సంవత్సరానికి గానూ జర్నలిస్ట్ బస్ పాస్ లను జారీచేయు సాఫ్ట్ వేర్ లో అవసరమైన మార్పులను చేసి ఈనెల 31 వరకు చెల్లుబాటులో ఉన్న జర్నలిస్ట్ పాస్ ల కాల వ్యవధిని మరో మూడు నెలల వరకు పొడిగించింది. 31.03.2022వరకు చెల్లుబాటు అయ్యే విధంగా పునరుద్ధరించడం జరిగిందని టీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ (ఐపీఎస్) లు తెలిపారు. రీజియన్ లోని పత్రికా ప్రతినిధులు జర్నలిస్ట్ పాస్ లు పొందేందుకు సంబంధిత ఏదైనా బస్ పాస్ సెంటర్ నుండి, జంట నగరాలకు సంబంధించిన పత్రికా ప్రతినిధులు గ్రేటర్ హైదరాబాద్ జోన్ లో ఏదైనా సెంటర్ నుండి జర్నలిస్ట్ బస్ పాస్ పొందవచ్చన్నారు. ప్రస్తుతం కలిగి ఉన్న అక్రిడిషన్ కార్డును చూపించి 31.12.2021 వరకు గడువు తేదీ ఉన్న ప్రస్తుత గుర్తింపు కార్డును బస్ పాస్ కౌంటర్ ఆపరేటర్ కు అందజేయాలన్నారు. అవసరమైన సర్వీస్ ఛార్జీని చెల్లించి 31.03.2022 వరకు చెల్లుబాటులో ఉండే కొత్త గుర్తింపు కార్డును పొందవచ్చన్నారు. ఏవైనా సందేహాలు, అసౌకర్యాలు కలిగితే పత్రికా ప్రతినిధులు 9959226390 నెంబర్ ను, జిల్లా పరిధిలోని పత్రికా ప్రతినిధులు సంబంధిత రీజియన్ లోని పర్సనల్ ఆఫీసర్ ను సంప్రదించాలన్నారు.

# తమిళనాడులో న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు..

తమిళనాడు, డిసెంబర్ 29: ఓమిక్రాన్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు న్యూ ఇయర్ వేడుకల పై ఆంక్షలు విధిస్తున్నారు. ఈ తరుణంలో తమిళనాడు సర్కార్ సైతం న్యూ ఇయర్ వేడుకల పై ఆంక్షలు విధించారు. రాష్ట్రవ్యాప్తంగా బీచ్‌లు, బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిషేధించింది. ఈ మేరకు తమిళనాడు డీజీపీ ఒక ప్రకటనలో వెల్లడించారు.

బహిరంగ ప్రదేశాలతో పాటు రెస్టారెంట్లు, క్లబులు, పబ్‌లలో కొత్త ఏడాది వేడుకలను అనుమతించేది లేదని డీజీపీ స్పష్టం చేశారు. కొత్త ఏడాదిలో మెరీనా బీచ్, ఎల్లియాట్స్ బీచ్, నీలంకారీ, ఈస్ట్ కోస్ట్ రోడ్ వంటి పబ్లిక్ ప్లేసుల్లో ప్రజలు ఎవరూ గుంపుగా తిరగరాదని అధికారులు సూచించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కొవిడ్ నిబంధనలు పాటించాల్సిందేనని చెన్నై పోలీసులు పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో వాహనదారులకు పోలీసులు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే అరెస్టు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాత్రి 11 గంటలలోపు కార్యకలాపాలను ముగించాలి. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రైవేట్ పార్టీలకు కూడా ఆంక్షలు వర్తిస్తాయి. కుటుంబ సమేతంగా ఇంటి వద్దే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఇదివరకే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తాజాగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. డిసెంబర్ 31 నుండి జనవరి 2 వరకు ర్యాలీలు, బహిరంగ సభలపై నిషేధం విధించింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో భౌతిక దూరం తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. మాస్క్ ధరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అలాగే న్యూ ఇయర్ వేడుకల్లోనూ కొవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించింది.



**రైతు**

మట్టి ముద్దలోంచి
ప్రమిదలు చేసినట్లు.
నేల నుండిపంట దినుసులు
అందించే అన్నదాత.

పంట భూములన్నీ
ప్లాట్లు గా మారె.
పండించే రైతు కుపాట్లు తప్పలే.
ముమ్ముందు మనకుపొట్ట తిప్పలే



\-పత్తి శివ ప్రసాద్
9440001224

# అఖిలేష్ యాదవ్ 'రథయాత్ర'

లక్నో, డిసెంబర్ 29:: అఖిలేష్ యాదవ్ రథయాత్రకి శ్రీకారం చుట్టారు. దాంతో ఆయన రథయాత్రకి విశేష స్పందన వస్తోంది. అత్యాచారం కారణంగా దేశవ్యాప్తంగా కలకలం రేపిన ఉన్నావ్ లో అఖిలేష్ యాత్రకి ఆదరణ దక్కింది. అంతేకాదు పార్టీ కార్యకర్తల నుండి కూడా ఆయనకి బహుమానాలు వస్తున్నాయి. వాటిని అఖిలేష్ యాదవ్ స్వయంగా తీసుకున్నారు. ఈ బహుమానాల్లో చాలా మందిని ఆకర్షించింది.. హనుమాన్ చిత్రపటం. ఓ వ్యక్తి హనుమాన్ చిత్రపటాన్ని అందిస్తుండగా అఖిలేష్ యాదవ్ తీసుకుంటున్న ఫొటోపై చర్చ జరుగుతోంది. ఆ చిత్రపటంలో పార్టీ కార్యకర్త పేరుతోపాటు సమాజ్‌వాదీ పార్టీ ఎన్నికల గుర్తు సైకిల్ కూడా కనిపిస్తుంది. ఉత్తరప్రదేశ్ లో రథ యాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఇలాంటి రథ యాత్రతోనే బిజెపి బలమైన పార్టీగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. ఇలాంటి రథ యాత్రతోనే బీజేపీ బలమైన పార్టీగా ఆవిర్భవించింది. 1990లలో ఎల్‌కే అద్వానీ ఉత్తరప్రదేశ్‌లో చేసిన రథ యాత్ర బీజేపీకి అనూహ్య మద్దతును తెచ్చిపెట్టింది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్నాయి.

కోవిడ్-19 కొత్త వేరియంట్ కేసులు అధికంగా నమోదుకావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణపై ఆలోచించుకోవాలని న్యాయస్థానాలు ఎన్నికల సంఘానికి సూచిస్తున్నాయి. అయితే, ఒమిక్రాన్ కారణంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు వాయిదాపడే అవకాశంలేదని ఎన్నికల సంఘం (ఈసీ) వర్గాలు తెలిపాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని వెల్లడించాయి. ఎన్నికలు సమీపించడంతో పార్టీలు ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోయాయి. ఇక్కడ అధికార బీజేపీతోపాటు సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ, కాంగ్రెస్‌లు ఈ ఎన్నికల బరిలో నిలిచి పోరాడనున్నాయి. బీజేపీ ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలతో అధికారాన్ని కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తుండగా, సమాజ్‌వాదీ పార్టీ తాము అధికారంలో ఉండగా జరిగిన అభివృద్ధి వల్లెవేస్తున్నది.

# గుడ్ న్యూస్.. లీటర్ పెట్రోల్‌పై రూ.25 తగ్గింపు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:వాహనదారులకు తీపి కబురు తెలిపింది ఝార్ఖండ్ ప్రభుత్వం. మోటార్ సైకిళ్లు, స్కూటీల్లో పెట్రోల్ కొట్టించేవారికి లీటరుకు రూ.25 రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ రాయితీ జనవరి 26 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్. హేమంత్ సోరెన్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో.. వాహనదారులకు భారీ ఊరట కలుగనుంది. అటు ఝార్ఖండ్ వాహనాదారులు కూడా హేమంత్ సోరెన్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాగా ఇప్పటికే ఒడిషా, ఢిల్లీ, కర్ణాటక, అస్సాం లాంటి చాలా రాష్ట్రాలు.. పెట్రోల్ మరియు డీజిల్ పై ధరలనున తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే.. అన్ని రాష్ట్రాల కంటే.. ఝార్ఖండ్ మాత్రం రూ. 25 తగ్గించడం గమనార్హం.

**చరిత్రలో నేటినిజం**





\-రాధశ్రీ
(డిసెంబర్ 30 కమెడియన్ వేణుమాధవ్ జయంతి.)
సెల్: 9494481210

# పిఎమ్-కిసాన్ పదో కిస్తీ ని జనవరి 1న విడుదల చేయనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:క్షేత్ర స్థాయి రైతుల కు సాధికారిత ను కల్పించే నిబద్ధత, సంకల్పాలకు అనుగుణం గా "ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎమ్-కిసాన్)" పథకం లో భాగం గా ఇచ్చే ఆర్థిక ప్రయోజనం తాలూకు పదో కిస్తీ ని 2022వ సంవత్సరం జనవరి 1వ తేదీన మధ్యాహ్నం పూట 12:30 గంటల వేళ కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. ఇది 10 కోట్ల కు పైగా లబ్ధిదారు రైతు కుటుంబాల కు 20,000 కోట్ల రూపాయల కు పైచిలుకు సొమ్ము బదిలీ కి మార్గాన్ని సుగమం చేయనుంది.

పిఎమ్-కిసాన్ స్కీము లో భాగం గా, ఒక్కో ఏడాది కి 6,000 రూపాయల ఆర్థిక ప్రయోజనాన్ని అర్హత కలిగిన లబ్ధిదారు రైతు కుటుంబాల కు అందించడం జరుగుతుంది. ఈ మొత్తాన్ని ఒక్కొక్క విడత లో 2,000 రూపాయల వంతు న 4 నెలల కు ఒక కిస్తీ పద్ధతి లో మూడు కిస్తీలు గా చెల్లించడం జరుగుతుంది. నిధి ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల లోకి నేరుగా బదలాయించడం జరుగుతుంది. ఈ పథకం లో, 1.6 లక్షల కోట్ల పై చిలుకు సమ్మాన రాశి ని ఇంతవరకు బదలాయించడమైంది.

ఈ కార్యక్రమం లో భాగం గా, ప్రధాన మంత్రి సుమారు 351 ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేశన్స్ (ఎఫ్ పిఒ స్ ) కు 14 కోట్ల రూపాయల కు పైగా ఎక్విటీ గ్రాంటు ను కూడా విడుదల చేస్తారు. ఇది 1.24 లక్షల కు పైగా రైతుల కు లబ్ధి ని కలగజేయనుంది. ప్రధాన మంత్రి ఈ కార్యక్రమం లో భాగం గా ఎఫ్ పిఒ స్ తో సమావేశమవుతారు. దేశ ప్రజల ను ఉద్దేశించి కూడా ఆయన ప్రసంగించనున్నారు.

# 'భారతకోకిల సరోజినీనాయుడు' జీవిత చరిత్ర ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు.

ఆచార్య మసన చెన్నప్ప రచించిన 'భారత కోకిల సరోజినీ నాయుడు' జీవిత చరిత్రను మంగళవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో, విశ్వ విద్యాలయ కులపతి ఆచార్య టి. కిషన్‌రావుగారు ఆవిష్కరించారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులకు ఈ గ్రంథం పాఠ్య గ్రంథంగా ఉండాలని ఆయా పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని ఆచార్య కిషన్‌రావు గారు అభిప్రాయపడ్డారు. మసన చెన్నప్పగారితో తాను ఉస్మానియా విశ్వ విద్యాలయంలో కలిసి చాలా కాలం పని చేశానని, చెన్నప్ప ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను బాగా అధ్యయనం చేసిన వారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తుమ్మూరి రామమోహన్ రావు గారు, సినీ డైరెక్టర్ మంజులగారు, నీల్‌కమల్ పబ్లికేషన్స్ అధినేత నరేశ్‌చంద్రశర్మ గారు పాల్గొన్నారు.

**కవి సంధ్య**
డా. ద్వానా శాస్త్రి స్మారక



**వచన కవితల పోటీ -2022**
కవితలు పంపడానికి చివరి తేదీ
15 ఫిబ్రవరి 2022
\# # #
బహుమతుల ప్రదానం
21, మార్చి 2022
అంతర్జాతీయ కవితా దినోత్సవం
యానాం
వివరాలు త్వరలో...

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 30-12-2021

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ


-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

నేటికవితలో ఈ వారం: 'మనసులో మాట'
అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ


-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

### తీపిమాట

ఎన్ని వసంతాల పులకింతలో
మదినిండా నిను నింపుకొని
నీ ఎదుట ఊర్వశినై
మయూరిలా నీకోసం నర్తించాలని వుంది...!.

ఆమని కోయిల రాగంలా
నీ తలపుల వలపు పల్లవులు
సమీరంలా నను తాకిన వేళ
నీకై ప్రేమ సరిగమలు పలికించాలని..!

నా మదిలో నీ ఊసులు
భ్రమరమై పరిభ్రమిస్తుంటే
విచ్చుకున్న పువ్వులే నీకై
నా మనసు మాటల్లో తీపినందించాలని..!

నీ మనసు నా మనసు
అనురాగపు కలయికలో
మాటల మకరందాలు గ్రోలుచు
మైమరపించే ప్రేమతపస్సులో
ముత్యమంత ముద్దుతో మన బంధాన్ని
ముడిపెట్టాలని ఉంది..!
రా..! ప్రియా..!
నా కౌగిలిలో నిన్నొదిగింపజేసి
నా సమస్తాన్ని అర్పించి
నీవే నేనుగా నేనే నీవుగా
మనసులో మాటయై
మరులుగొలిపి
సుధల్ని పంచుకుందాం..!!


-చిందం సునీత
కోరుట్ల

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన కవయిత్రి చిందం సునీత గారు మనసులోమాట అంశంపై తీపిమాట శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం రమణీయ భావాలతో రూపుదిద్దుకుంది. కవయిత్రి సునీత గారు అంశం వెలుగులో తమ మదియందు కదలాడే ఊసులకు.. ఊహలకు అక్షర రెక్కలు కట్టారు.. ప్రియుడ్ని ఉద్దేశించి .. మనసులోని మాటలను తీపిమాటలుగా ప్రేమ మధురిమల మూటగా మనకు అందించారు. నీవే నేనుగా.. నేనే నీవుగా .. మనసులో మాటయై మరులు గొలిపే సుధలను పంచుకుందామంటూ ప్రియునికి తమ మనసులో సవ్వడి చేసే సరిగమలను అక్షరాల్లో అందంగా ఆవిష్కరించడం అభినందనీయం..
ఎన్ని వసంతాల పులకింతలో మదినిండా నింపుకుని .. నీ ఎదుట ఊర్వశినై మయూరిలా నీకోసం నర్తించాలని ఉంది జీవిత భాగస్వామిని ఉద్దేశించి ప్రియా! అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. సరసమైన మాటలకు చోటు కల్పిస్తూ.. భావకవిత్వానికి పెద్దపీట వేస్తూ కవయిత్రి సునీత గారు ప్రకటించిన భావాలు బాగున్నాయి. ప్రియునికోసం ప్రేమ సరిగమలు పలికించేందుకు ఆమని కోయిల రాగంలా.. తలపుల వలపు పల్లవులు ప్రణయసమీరంలా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. నా మదిలోని ఊసులు భ్రమరమై పరిభ్రమిస్తుంటే.. విచ్చుకున్న పువ్వులే నీకై నా మనసు మాటల్లో తీపి నందించాలని ఉందని అంటూ ప్రియుడ్ని ఉద్దేశించి రాసిన పంక్తులు కవితలో అందంగా ఒదిగిపోయాయి.
నీ మనసు నా మనసు అనురాగపు కలయికతలోమాటల మకరందాలు గ్రోలుచు.. మైమరపించే ప్రేమ తపస్సులో ముత్యమంత ముద్దుతో మన బంధాన్ని ముడి పెట్టాలని ఉందంటూ కొనసాగించిన తీరు పాఠకులకు గిలిగింతలు పెట్టేలా ఉంది. రా! ప్రియా! నా కౌగిలి లో నిన్నొదిగింపజేసి నా సమస్తాన్ని అర్పించి నీవే నేనుగా..నేనే నీవుగా మనసులోని మాటయై మరులు గొలిపే సుధల్ని పంచుకుందామంటూ ప్రియుడ్ని ఆహ్వానించడం బాగుంది. కవయిత్రి సునీతగారు ప్రతీపంక్తిని కవితామయం చేస్తూ రాసిన తీరు అభినందనీయంగా ఉంది.

### కనురెప్పల కాన్వాసు

తొలికిరణ కాంతుల జల్లుల్లో తడుస్తూ
అందని ఆకాశాన్ని కనురెప్పల
కాన్వాసుపై చిత్రించుకొని..

ఆశల బారులు హాయిగా ఎగురుతుంటే
కదలలేని చెట్టు కమ్మని గాలులతో అవని అంతటా
ఊపిరిని నింపుతూ స్వేచ్ఛా ఊహల్లో తేలినట్టు

తొలకరి వానలకు తడిసిన నేలమ్మ పులకరింతలతో
నవ్వుల విత్తనాలకు ప్రాణం పోసి

ఆనందాల మొక్కలను పెంచుతూ
ఎర్రెర్ర చిగుర్లతో అందరి మోములలో
కెంజాయ రంగులను అద్దుతూ

మనోవికాస తరంగాలతో మదివేదికపై విజ్ఞాన వీణమీటగా
అద్భుత ప్రపంచపు అందాలను తనివితీర ఆస్వాదిస్తూ

నీ అడుగులజాడనై
నీ ఎద లోగిలిలో దివ్వెనై
మన ఏడడుగుల అనుబంధపు.
వెన్నెల నీటిని తాగుతూ

పున్నమిలో తారకకై నీ కన్నుల
కాంతులు పూయించ
మళ్లీ మళ్లీ పుట్టనా నీ వాసంత సమీరాన్నై


-వకుళవాసు,
హన్మకొండ

హన్మకొండకు చెందిన కవయిత్రి వకుళవాసు గారు మనసులోమాట అంశంపై కనురెప్పల కాన్వాసు శీర్షికతో రాసిన కవితలో పున్నమిలో తారకనై నీ కన్నుల కాంతులు పూయించ మళ్లీ మళ్లీ పుట్టనా వాసంత సమీరాన్నై అంటూ జీవిత భాగస్వామిని ఉద్దేశిస్తూ తమ అంతరంగంలోని భావాలను ప్రకటించడంలో చక్కని భావుకతను ప్రదర్శించారు. కవయిత్రి వకుళవాసుగారు ప్రారంభంలోనే తొలి కిరణ కాంతుల జల్లుల్లో తడుస్తూ అందని ఆకాశాన్ని కనురెప్పల కాన్వాసుపై చిత్రించుకొని అంటూ పాఠకులకు కవితపై పఠనాసక్తిని పెంచేందుకు కృషిచేయడం అభినందనీయం. కవితావస్తువుకు అనుగుణంగా చతురతతో శిల్పానికి ప్రాధాన్యతనిస్తూ ఔచిత్యవంతమైన పదబంధప్రయోగం చేస్తూ అభివ్యక్తిలో విలక్షణతను పాటించారు.
ఆశల బారులు హాయిగా ఎగురుతుంటే.. వంటి పదబంధాలు కవితకు మరింత శోభను కూర్చాయి. కదలలేని చెట్టు కమ్మని గాలులతో అవని అంతటా ఊపిరినినింపుతూ స్వేచ్ఛా ఊహల్లో తేలినట్టుందని చెప్పడం కవయిత్రియొక్క రచనావైచిత్రికి అద్దం పట్టేలా ఉంది. తొలకరి వానలకు తడిసిన నేలమ్మ పులకింతలతో..నవ్వుల విత్తనాలకు ప్రాణం పోసి అంటూ కొనసాగించి కవయిత్రి వకుళగారు కవితకు మరింత గాఢతను కూర్చారు. ఆనందాల మొక్కలను పెంచుతూ ఎర్రెర్ర చిగుర్లతో అందరి మోములతో కెంజాయి రంగుల అద్దుతూ..మనోవికాస తరంగాలతో మది వేదికపై విజ్ఞాన వీణ మీటగా అద్భుత ప్రపంచపు అందాలను తనివి తీర ఆస్వాదిస్తూ.. అంటూ కొనసాగించి కవయిత్రి తమ కవితాపటిమను ప్రదర్శించారు. నీ అడుగుజాడనై నీ ఎదలోగిలిలోదివ్వెనై మన ఏడడుగుల అనుబంధపు వెన్నెల నీటిని తాగుతూ పున్నమిలోని తారకనై నీ కన్నుల కాంతులు పూయించ మళ్లీమళ్లీ పుట్టనా నీ వాసంత సమీరాన్నై అంటూ అందంగా ముగించారు. కవయిత్రి వకుళవాసుగారు అంశానికి తగ్గట్టు శీర్షికనుపెట్టి అలతి అలతి పదాలతో అద్భుతమైన భావాలకు కవితలో చోటుకల్పించారు. పాఠకులు హాయిగా చదువుకోవడానిక యోగ్యంగా కవయిత్రి కవితను తీర్చిదిద్దారు. ఆమె ప్రయోగించిన చక్కని వర్ణనలు..పోలికలు..ఉపమానాలు..కవితకు మరింత బలాన్నిచ్చాయి.

### మనసున మల్లెలు

నా మనసున మల్లెలు పూయించి
పిల్లగాలుల తెరలలో నాట్యమాడిన
నా మనసులోని మాటల జావళీలు
నీ దరిచేరేవేళకై
పదిలంగా దాచి ఉంచేను
ఆ మాటల సుగంధం నిన్నుచేరాలని
ఆ సమీరాలు నిన్ను అల్లరి చెయ్యాలని
దూరానా వున్నాననే తపన
దరి చేరితే అలుకలు
నీ చెలిమిలోనున్న మధురిమలు
నా మదిని తాకి గిలిగింతలు పెడుతూవుంటే
ఊహల రాజ్యంలో ఉయ్యాయలలూగుతున్నా
కలలో కలవరింపులు

దరిచేరితే మాటలురాని మూగనౌతా
మన ప్రేమ సంసార సాగరం
నీ కనులు చేసిన బాసలు
చెప్పుకున్న గుసగుసలు
వెండి వెన్నెల జాబిలిలో
కోపతాపాల సరిగమలు
నీమది కోవెలలో బందీనై
నామాటల పువ్వులతో నీ చెంత చేరాలని
గడుసుమనసు వినదే
తనలో దాచుకున్న మాటల పొదిని
నీ ముందు విప్పునివ్వని సిగ్గు దొంతరలు
నీలో ఏమి గారడీ దాగుందో


-రేవిణిపాటి రమాదేవి
హైదరాబాదు

హైదరాబాదుకు చెందిన సీనియర్ కవయిత్రి రేవిణిపాటి రమాదేవి (భ్రమర) గారు మనసులోమాట అంశంపై మనసున మల్లెలు శీర్షికతో రాసిన కవితలో మాటవినని గడుసుమనసును అక్షరాలలో ఆవిష్కరింపజేశారు. మనసుల మల్లెలు పూయించి పిల్లగాలుల తెరలలో నాట్యమాడిన మనసులోని మాటల జావళీలను జీవితభాగస్వామి దరిచేరే వేళకోసం పదిలంగా దాచి ఉంచానంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. ఆ మాటల మాటున దాచిపెట్టిన సుగంధం భర్త దరి చేరాలని అవి సమీరాలై భర్తను అల్లరి చేయాలన్న ఆకాంక్షను అందంగా అక్షరాలలో బంధించారు. దూరాన ఉన్నావనే తపన అంతరంగాన ఆలోచనా తరంగాలై కవ్విస్తున్నా అదేమిటో.. దరిచేరగానే ఆయనపై అలకలు అంటూ సహజసిద్ధమైన భావాలకు కవ యిత్రి రేవిణిపాటి రమాదేవి గారు తమ కవితలో పొందుపరచారు. భర్త చెలిమిలో ఉన్న మధురిమలు ఆమె మదిని తాకి గిలిగింతలు పెడుతూఉంటే ఊహల రాజ్యంలో ఉయ్యాల లూగుతున్నానంటూ కొనసాగించిన పంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. ఇంకా భర్తగురించి హృదయవేదికపై నర్తించే భావాలను ఆమె తర్వాతి పంక్తులలో రమణీయంగా పొందుపరిచారు. దూరాన వున్న భర్తకై కలలో కలవరింపులు..దరిచేరితే మాటలు రాని మూగనవుతా.. మన సంసారసాగరం నీ కనులు చేసిన బాసలు చెప్పుకున్న గుసగుసలు వెండి వెన్నెల జాబిలిలో కోపతాపాల సరిగమలు అంటూ మనసులోని మాట జావళీలను అలవోకగా అక్షరాలలోకి ఒంపి అందరినీ మెప్పించారు.
నీ మదికోవెలలో బందీనై నా మాటల పువ్వులతో నీ చెంత చేరాలనీ.. కొనసాగించిన తీరు బాగుంది. కవిత ముగింపులో గడుసు మనసు వినదే... తనలో దాచుకున్న మాటల పొదిని నీ ముందు విప్పునివ్వనీ... సిగ్గు దొంతరలు నీలో ఏమీ గారడీ దాగుందోనని చమత్కరించారు. ఇలా కవయిత్రి రేవిణిపాటి రమాదేవి గారు వస్తువు వెలుగులో మనసున మాటలరూపంలో కొలువుదీరిన మల్లెలను అక్షరాలలో నిక్షిప్తం చేశారు. సంసారసాగరంలోని మధురిమలను, సరిగమలను చేసుకున్న బాసలను.. గుసగుసలను.. అందంగా ఆవిష్కరించడంలో కవయిత్రి సఫలీకృతులైనారు. ప్రయోగింపబడిన పదబంధాలు అంశానికి వెలుగులు పంచాయి. కవయిత్రి భావుకతకు ప్రతిబింబాలుగా నిలిచాయి. సరసమైన భావప్రకటనకు వయసుతో నిమిత్తం లేదని ఈ కవితద్వారా రమాదేవి గారు రుజువుచేసారు.

### ఘంటారావం

పొంచి ఉన్న ప్రమాదాన్ని
పసిగట్టకపోతే ఎలా?
ఏమరుపాటుగా ఉంటే
నివ్వెరపాటే కదా.

అహంకారానికి మించిన
శత్రుత్వం ఏముంది?
మమకారానికి మించిన
మిత్రత్వం ఎక్కడుంది?

తలగడ
తల్లిలాంటిదే
కన్నీళ్లు తుడిచి
కడుపులో దాచుకునేదే.


-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

### కోరస్ పాడేద్దాం- నవగీతికనాలపిద్దాం

ఆకాశపు అంచులు తాకే ఆనందాలు ఓ ప్రక్క
గుండె గాయాలతో అల్లల్లాడే విషాదాలు మరో ప్రక్క
ఆశావహ దృక్కులతో సాటే బతుకులేమో మరికొన్ని
కంటి చెమ్మతో చిమ్మచీకటౌతున్న
బతుకులు ఎన్నో! ఎన్నెన్నో!!
ముప్పిరిగొన్న మహోద్విగ్న భరిత క్షణాల- విలక్షణ
వైరుధ్యాల పల్లవులతో వైచిత్రిగా సాగే మలుపులెన్నెన్నో
కోటి ఆశలతో కొత్త సోపతికి స్వాగతమంటూనే
వెంట నడిచొచ్చిన 12 నెలల నెచ్చెలిని
భారంగా వదులుకుంటూనే
కలయిక-వీడుకోలు జీవితనాటకరంగపు అంకమంటూనే
'మూసుకున్న మధురక్షణాల' 'రెప్పల వాకిళ్ళ' నుండి
వస్తూ..వస్తూనే
ఒళ్ళు విరుచుకున్న నిముషాలు గంటల్ని దాటుకుంటూ
సరికొత్త బాటలో సాగే
గమ్యపు ప్రణాళికలు రచించే.. 'శూన్యగంటలు'
ఆపై మంచు దుప్పట్లు పరుచుకున్న
డిసెంబర్ 31 రాత్రి పన్నెండు గంటలు
బంగరు లోకపు కలల ప్రపంచానికి
అందరూ కథానాయిక-నాయకులే
గత కాలపు అనుభవాల వంతెనలు దాటుకుంటూ
సొదలరొదలు వింటూ మదిని దిటవు చేసుకొని
ఉల్లాసపు ఉషస్సుల కోసం అంగలార్చుకుంటూ
దౌర్జన్యాలు-దుర్మార్గాలు,
అలజడులు-హాహాకారాలంటూలేని
జీవన గమనపు రథచక్రాలైన
ఆడపిల్లల కళ్ళల్లో చెమ్మల్లేని
కొత్త వేకువల కువకువరావాల రస రాజ్యాలకు
తెరలనెత్తుకుంటూ
మనిషి మనిషిగా మన గలిగే
కొత్త అంకానికి శ్రీకారం చుడుతూ
ఈ క్షణం నుండి అన్ని
పవనాలనీ ఆఘ్రానిద్దాం-ఆహ్వానిద్దాం
సమయోచిత ఓర్పు-నేర్పులతో
కొత్త వత్సరాన్ని స్వాగతిద్దాం
నిశ్చయ 'నిర్భయ భారతం' మాకు
ఆనందమంటూ- ఆమోదమంటూ
నీవూ-నేనూ, మనందరం
'జగమంత కుటుంబం'గ సాగుదాం
నవనవోన్మేషణ రసగంగా
ప్రవాహానికి శృతి లయలౌదాం
నూతన వత్సరానికి మనస్ఫూర్తిగా
స్వాగత గీతిని కోరస్‌గా పాడేద్దాం!

- సంపటం దుర్గా ప్రసాదరావు
సెల్:8466965401

### అంధకార ఆకాశంలో

పల్లవి: అంధకార ఆకాశంలో
అధర్మాల సామ్రాజ్యంలో
ఉదయించెను క్రీస్తుతారా!
వెలుగొందెను వెతలు దీరా! ॥అం॥

చరణం:మానవత్వమే రూపమై
మహికెల్లను ఆదిత్యదీపమై
ఏతెంచెను ఏసుప్రభువే..
ముక్తిగాంచగా ఈ జగమే!
అట్టి క్రీస్తు సంస్మరణం
అందరికీ శుభతరుణం!.. ॥అం॥

దీనులపలు వ్యాధులనూ
దయతోడను తొలగించీ
హీనుల పాపాలన్నీ
వెనువెంటనె అణగించెను!
వెన్నెలనే కాయించెను
వేడుకయే కలిగించెను! ॥అం॥


- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

### 'వెల్' కమ్ 2022.!

'వెల్' కమ్..'వెల్' కమ్
ఆంగ్లమంటే అంతిష్టం నాకు..
ఏ ఏడాదికాఏడాది
'హ్యాపీ న్యూ ఇయర్' అనే అరుపుల రుచి
మరిగిన దాన్ని..
అర్థరాత్రి ఎక్కడపడితే అక్కడ
పక్కన ఎవరున్నా పర్వాలేదు..
గొంతెత్తి పెట్టే గావుకేకల్ని
మురిసిపోతూ మరీ ఆస్వాదిస్తున్నదాన్ని...
నీకు తెలియదు.. చెప్పినా అర్థం కాదు..
ఆంగ్లమంటే అంతిష్టం నాకు..
రేపటి భావితరాలకు
సవతి తల్లివైనా ఆధారం నీవేనని నమ్మినదాన్ని
రాబోయే అవకాశాలకు
నువ్వే పునాదివని ఎలుగెత్తి చాటుతున్నదాన్ని..

ఆంగ్లమా.. నీ పేరు వింటేనే
నాకు ఆంగ్లంలో పూనకం,
తెలుగులో పులకరింత వచ్చేస్తుంది..
నీ హొయల వొడిలోనే నా
అంతరాగ్ని విశ్రమిస్తుంది..
నిన్ను కొలుస్తుంటేనే
నా జీవనం సుఖమయమవుతుంది..
నాకు 'టెల్గు' రాదు అనే మంత్రాన్ని
నిత్యం జపిస్తున్నదాన్ని ...

కానీ అదేంటో..
ఆకలికి. ఆవేదనకి తెలుగు తెలుసు
అవెప్పుడూ 'అమ్మా' అంటుంటాయి..
అనురాగానికి, అనుబంధానికి కూడా తెలుగు తెలుసు..
కన్నీళ్ళకు తెలుగు తెలుసు..
ఆంగ్లమా... నా ఆంగ్లమా
నీలోని భావాల్నయినా యేరివుంచు..
ఆంగ్ల తీగల్ని చుట్టకున్న నా దేశాన్ని
వీలయితే తెలుగులోకి అనువదించు..
ఇప్పటికైతే..
'వెల్' కమ్.. 2022..
బట్..'బి.గుడ్' విత్ మి ప్లీజ్..!!


-శైలజామిత్ర
9290900879

పుస్తక సమీక్ష

## మమతా బెనర్జీ బెంగాలీ కవిత్వం-సామాన్య తెలుగు అనువాదం

మమతాబెనర్జీ-దేశ రాజకీయాలపై ఆమెది బలమైన ముద్ర. 1955 సం॥లో కోల్‌కటాలో జన్మించిన మమత ఇస్లామిక్ చరిత్రలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఉన్నత విద్యావంతురాలు. 1970 సం॥లో రాజకీయ ప్రవేశం చేసి 1997 వరకు కాంగ్రెస్ పార్టీలో కీలకపాత్ర పోషించారు. మన్‌మోహన్‌సింగ్ మంత్రి వర్గంలో రైల్వేశాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించి 1998 సం॥లో తృణమూల్ కాంగ్రెస్ పేరిట వేరు, కుంపటిని పెట్టి అత్యంత శక్తివంతమైన రాజకీయ పార్టీగా తీర్చిదిద్దారు. భారత పార్లమెంటులో 20మంది సభ్యులతో అది నాలుగవ అతిపెద్ద పార్టీ యిప్పుడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన రాజకీయ చతురత ఆమె స్వంతం. 1984 సం॥లో సింగూరులోని టాటా కంపెనీని గుజరాత్ రాష్ట్రానికి తరిమేసి అక్కడి బలవంతపు భూసేకరణను నిలిపివేసి రైతుబంధుగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. జాదల్‌పూర్ నియోజకవర్గంలో వామపక్ష నాయకుడు సోమనాథ్ చటర్జీని ఓడించి 'ఫైర్ బ్రాండ్'గా ప్రసిద్ధికెక్కిన ధీరవనిత. ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన మమత అవివాహిత మరియు కాళీ ఉపాసకురాలు. కొద్దిగా రాజకీయ పరిజ్ఞానం వున్న ఎవరికైనా ఈ విషయాలు అవగతమే. కానీ మమతా బెనర్జీ కవయిత్రి, రచయిత్రీ అని కొద్దిమందికే తెలుసు. సాహిత్యం, చిత్రకళ, సంగీతం మీద అపారమైన ప్రేమవున్న ఆమె స్వయంగా చిత్రాలు కూడా గీస్తారు.

1995లో 'ఉపలబ్ధి' పేరిట తొలి కవితా సంపుటి వెలువరించిన మమత యిప్పటి వరకు దాదాపు 950 కవితలు రాశారు. బెంగాలీ భాషలో రాసిన ఆమె కవిత్వంలోని సుమారు 50 కవితల తొలి తెలుగు అనువాద సంపుటి 'సరళ, సుందర, సునిశిత మమత". ఈ అనువాద కావ్య రచయిత్రి శ్రీమతి సామాన్య కిరణ్. ఆంధ్రోపన్యాసకురాలిగా ఉద్యోగించి, ప్రస్తుతం సాహిత్యమే వ్యాపకంగా కొనసాగుతున్న ప్రతిభావంతురాలు. కథకురాలిగా, కవయిత్రిగా సాహితీలోకానికి చిరపరిచితురాలు. వైఎస్సార్పీ నాయకురాలిగా ఆమె రాసిన పలు రాజకీయ, సాహిత్య వ్యాసాలు 'సాక్షి'లో చదివినట్లు గుర్తు. వంగ భాషా కవిత్వాన్ని, అనువాదానికి ఎంచుకోవడానికి కారణం బహుశః పశ్చిమ బెంగాల్‌తో ఆమెకున్న అనుబంధం కావొచ్చు. 2006 సం॥లో వంగ దేశంలో విస్తృతంగా పర్యటించి అక్కడి రాజకీయ, సాహిత్య విశేషాలను ఆకళింపు చేసుకున్నారు సామాన్య. బెంగాల్ టైగర్‌గా గర్జిస్తున్న మమతా బెనర్జీ స్ఫూర్తి దాయక ప్రస్థానం ఆమెను విపరీతంగా ఆకర్షించింది. కరుడు కట్టిన రాజకీయ నాయకురాలి సాహిత్య సృజనలోని కోమలత్వం, సరళత, సామాన్యను అనువాదానికి పురికొల్పేలా జేసింది. సామాన్య భర్త కిరణ్ పశ్చిమ బెంగాల్ కేడర్ ఐఏఎస్ ఆఫీసర్‌గా అక్కడే ఉద్యోగిస్తుండటం కూడా ఆమెకు వంగ రాష్ట్రంతో అనుబంధం గట్టిపడేలా చేసి వుండవచ్చు.

ఎవరికైనా అమ్మ అమృతం. ఆమే తొలి గురువు. తల్లిని గూర్చి చాలా కవితలు రాశారు మమత **"అమ్మా నీ సుందరమైన నవ్వు/ నాముఖాన్ని**



**వెలిగిస్తుంది"** అంటు పరవశించిపోతారు. **"నీ నవ్వు తేనె వరద అమ్మా"** అనడంలో అమ్మ నవ్వు ఎంతటి తీయని అనుభూతుల్ని పంచుతుందో అవగతమవుతుంది. **"నీ చేతితో ఇచ్చే కప్పు చాయి/ ఆ రోజుటి నా శక్తికి తొలి బీజం/ అమ్మా! నీవు నా తొలి గురువు/ ఇంటికి రాగానే తల్లి పక్షిలా/ నీ చేత్తో తినిపించేదానివి/ అన్నింటికన్నా ముందు/ నీ స్పర్శే పెద్ద చికిత్స"** ఎన్ని జ్ఞాపకాలు! ఎన్నెన్ని మధురస్మృతులు!! ఆమె కనుమరుగైతే? **"నీవు వెళ్ళిపోయావు/ అన్నీ వున్నట్టే అనిపించినా/ అంతటా శూన్యం/ తల్లికి సాటి ఎవరూ లేరు/ ఎన్నటికీ కాలేరు"** అక్షర సత్యం యిది. యిప్పటి తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటి? వృద్ధాప్యంలో కన్న బిడ్డల నిరాదరణకు గురవుతున్న **"ముసలి తల్లిదండ్రులను చూస్తే/ అనిపిస్తుంది వీరికెవరూ లేరే అని/ మానవజన్మ ఎంత దయనీయమని!"** పెంపుడు కుక్కలకు దక్కిన ఆదరణ క్కూడా నోచుకోని తల్లిదండ్రుల దీన పరిస్థితిని కళ్ళకు కద్దారు కవయిత్రి. యిలాచాలా పంక్తులు కరుణాత్మకంగా, హృద్యంగా పలకరిస్తయి.

శ్రమశక్తిని నమ్ముకున్న కష్టజీవుల్ని ఆత్మ స్థయిర్యం కోల్పోవద్దంటారు మమత. అర్థాకలితో కృశించినా సరే.. ఒకరి ముందు తలవంచి. చేయి సాచవద్దని హితవు పలుకుతారు.

**"భిక్షమెత్తొద్దు రొట్టెను**
**పొరపాటునైనా యాచించకు!**
**చల్లారబోదు ఆకలి జ్వాల మరణ పర్యంతం**
**సగం కడుపే నిండనీయి గాక**
**రొట్టె కావాలని మాత్రం అడుగకు!"** జీవించడం మనిషి హక్కు. శ్రమశక్తే ఆయుధం. నిస్సహాయ స్థితికి తావు యివ్వద్దని కవయిత్రి భావం.

మనిషి మనుగడకు నీరు అవసరం. తాగడానికి, స్నానానికి, బట్టలు ఉతకడానికీ యిలా అనేక దైనందిక అవసరాలకు నీళ్ళు అత్యవసరం. దేశంలోని కొన్ని ప్రాంతాలలో నీరు దొరకని పరిస్థితి. కరువు తాండవ మాడుతుంటుంది. చుక్కనీరు దొరక్క గొంతులెండిపోయే దుర్భరస్థితి. ప్రకృతికి యిదొక పార్శ్వమైతే.. అకాల వర్షాలతో.. వరదలతో, అల్పపీడనంతో మానవ తప్పిదంతో అస్తవ్యస్తమవుతున్న జన జీవనం-మరో పార్శ్వం. ఈ ప్రళయాన్ని కవయిత్రి కళ్ళకు కట్టిన తీరు గమనించండి.

**"నీళ్ళు ప్రవాహమై వచ్చాయి**
**ఎక్కడి నుండో నీళ్ళు**
**ఎవ్వరికీ తెలియలేదు**
**కాల్పనిక జలం ఎవ్వరికీ కబురు పెట్టలేదు**
**హఠాత్తుగా వచ్చి పడింది**
**ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోయాయి**
**కళ్ళలో నీరు.. చెంపలపై నీరు**
**అన్నింటినీ కోల్పోయిన కన్నీరు**
**నీరు అందరినీ ముంచేసింది"** ఎవ్వరికీ పనికిరాని నీరు.. త్రాగటానికి అనువుగాని నీరు!

**"ఎందుకిది**
**ఇంత నీటి ప్రవాహం మధ్య**
**త్రాగడానికి నీరు లేదు**
**అందరూ దాహంతో వున్నారు**
**కాస్త త్రాగు నీరు ఇస్తారా!"** కవయిత్రి సునిశిత పరిశీలనకు, లోతైన అవగాహనకు దర్పణం పట్టిన కవిత **"త్రాగునీరు"**. పాతది నశిస్తేనే గాని క్రొత్తది పుట్టుకరాదు అనేది ఓ సిద్ధాంతం. యిక్కడ నాశనం అంటే నిర్మూలించడం. విధ్వంసం కాదు అంటున్నారు మమత.

**"విధ్వంసం నుండి అభివృద్ధి**
**పుడుతుందనేది అపప్రచారం**
**మనుషులందరినీ కలుపుకొని పోలేని**
**అభివృద్ధి**
**విషాభివృద్ధి**
**ధ్వంసాభివృద్ధి**
**వక్రాభివృద్ధి"**. ఇలాంటి వక్రాభివృద్ధి కాదు సమాజం కోరుకునేది అంటున్నారు కవయిత్రి.

**"ప్రతికూల పవనాలను నెట్టికొట్టు**
**గొప్ప అవకాశాల కొత్త ప్రపంచాన్ని నిర్మించు"** అని పిలుపునిస్తున్నారు.

**"అన్యాయాలు చెయ్, గొంతుకలు కోసెయ్**
**నిముషాలలో విడుదలై వచ్చెయ్**
**ఇంకా మూలుగుతుంటే డబ్బుల మూటలు**
**టీవీఛానెల్ పెట్టేసెయ్"** పాఠకులకు ఎవరో స్ఫురిస్తున్నారు కదూ! ఒకరేమిటి? సమాజంలో ఎక్కడ వెదికినా అక్కడే పుట్టుకొస్తుంటారు యిలాంటి అక్రమార్కులు.

చివరగా ఓ మినీ కవితను గమనిద్దాం.

**"తల పడటానికి ముందు యోచించు**
**యోచించడానికి తలను ఉపయోగించు**
**పోరాడటానికి తెలివి కావాలి**
**మెదడు లేకుంటే యుద్ధభూమి బలికొంటుంది"** యిదీ మేధస్సు గురించి మమత వ్యాఖ్యానం.

మమతా బెనర్జీ కవిత్వంలోని భావావేశాన్ని ఒడిసిపట్టి సరళ, సుందర, సునిశిత మమత"ను మనముందు సాక్షాత్కరింపజేస్తున్నారు అనువాదకురాలు సామాన్య. అనువాదంలా గాక అచ్చం తెలుగులో మూలరచనలా గోచరించే కవితల్ని ఆస్వాదించండి.. అనుభూతించండి..

**ప్రతులకు:** పాలపిట్ట బుక్స్
16-11-20/6/1/1
403, విజయసాయి రెసిడెన్సీ
సలీం నగర్, మలక్‌పేట్
హైదరాబాద్-500 036
సెల్: 9848787284


- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

### ఎక్కడా ఏవీ కనిపించవు

ఎక్కడా ఏమాత్రం ఆచూకీ మచ్చుకైనా కనిపించదు.
అణువణువునా అల్లుకుపోయిన మరువపు మొలకలు
లోలోని సౌరభ వీవనలు నడి వీధి వరకూ గాలి ప్రవాహాలను
ఏ క్షణమూ మళ్ళించవు.
ఖాళీ గోడలకు చూపులు గుచ్చి
ఏం పెకలిస్తూ ఉన్నానో ఎవరికీ తెలియదు
రాజసం తలఒగ్గని కళ్ళకు అలదుకున్న కాటుక తెరవెనక
అనుక్షణం రాజుకునే ఆవేదన నిప్పుల సెగపై కమిలిపోతున్న
కరిగిపోతున్న సౌకుమార్యపు మెత్తని మనసు ఆనవాళ్ళ జాడలైనా
అలరారే నవ్వుల మధ్య అంతుచిక్కవు.

కాని
చెట్టు చెట్టునా చెక్కిలి మీద చేతులాన్చి చూసే హరిత పత్రాలను
మౌనంగానే ఊపిరి అందని శిల్పాన్నై
చేతులు జోడించి వేడుకున్నా
తీగల్లేని రాయబారాన్ని కొమ్మకొమ్మనూ దాటించి
రహస్యంగా నీకు చేర్చమని.
నిజానికి ప్రపంచమంతా కన్నీటి కడవలను గుమ్మరించి
వీడ్కోలు విషాద గీతాలు పాడినా
ఇక్కడ ఈ గుండె గది శేషతల్ప శయనం మీద
విశ్రమించిన నిన్ను ఎవరైనా ఎక్కడికని పంపగలరు చెప్పు.

పగలంతా గుంపులు గుంపులుగా ఎగిరివచ్చే మాటలకూ
మనసుకు నచ్చని పరామర్శలకూ చిరాకుచిరాగ్గానే ఉంటుంది.
ఆ చిరాకు వేడికి మైనపు బొమ్మలా కాస్త కాస్త కరుగుతూనే ఉంటాను
ఒంటి స్తంభపు గాజుమేడలా కనిపిస్తానేమో గాని
నా చుట్టూ నువ్వే కంచుకోటవని తెలియక
పోటీ పడి విసరడానికి రాళ్ళు పోగేసుకుంటారు
కొంచం శాడిజం కొంగున కట్టుకు వచ్చిన వాళ్ళు
అచ్చమ్మ బుచ్చమ్మ కథలు గురి చూసి గుడ్డి బాణాల్లా వదులుతారు

అయితేనేం నా చుట్టూ అల్లుకున్న కవచం ఒకటి
మౌనంగానే తిప్పికొడుతుంది అక్షరాలుగా మార్చిన
బూమరాంగ్ లను.
సాయం సంధ్యకు యుద్ధ విరమణ ఏకపక్షంగా ముగిసాక
ఎక్కడా ఏ మాత్రం అడాపొడా వదలకుండా
అంతః పురానికి నిష్క్రమించాక
ఒక పూల జల్లు తొలిచినుకై రాలుతుంది.
మూసిన కనురెప్పల వెనక దేహాన్ని వదిలి
రాళ్ళూ ముళ్ళూ లేని ఈ బృందావన సంచారం
ఎవరికీ ఏమీ తెలియదు - కనిపించదు.


-స్వాతీ శ్రీపాద
8297248988

### పరుగుకు వెనుకడుగు ఎక్కడిది !!

"బిడ్డా ! యాడున్నవ్ తిననికీ రా"
అంతే ! వాకిలి నుండి
కంచం ముందుకు
పరుగే పరుగు వాయువేగం

"అరేయ్ ! కబడి ఆడుకుందాం రా"
వస్తి ! అరుగుమించి అవతలికి
సిగ్నల్ వడ్డట్టే రైలు లెక్క పరుగు
వాయువేగం మనోవేగం

దూరం నుండి బడి గంట
చెవిని పిండగనే సంచిని
భుజం కొయ్యకు తగిలించుకోని
జింక లెక్కనే పరుగు
వాయువేగం మనోవేగం కాంతివేగం
ప్రార్థన గచ్చిగ పాడాలే కదా

రాత్రి గుడి గంట ఊరంత మోగంగ
హోం వర్క్ కు కామవెట్టి
గరుడ పక్షి లెక్క దేవుడి ముందు వాలుడే
గంట మీద సంతకం కొట్టుడే
ప్రసాదం అయిపోతే ఎట్లా
దేవుడు యాడినించి తెస్తడు
మాయనా మంత్రమా

చిన్నప్పటి నుండి దేనికైనా
పరుగులు పరుగులే
అస్సలు నడిచింది లేదు
నడిచేటోల్లు నా ముందు వెనుకడుగే

సూర్యోదయాలు సూర్యాస్తమయాలు
నా పరుగుల వెనుకే

అందరూ అంటరు
నీ పాదాల కింద గిర్రున చక్రాలేమో
మోకాలికి దెబ్బలు తాకినా సరే
ఉరుకుడే నొప్పికి విరుగుడు
బంగారకు తరుగుంటదేమో
పరుగుకు తరుగెక్కడిది

పరుగులో ఆనందం
పరుగులో గెలుపు
పరుగులతోనే పట్టాభిషేకాలు
పరుగులే ప్రైజులు

ఇప్పుడింక నా
కలం పరుగులు తీస్తున్నది
మొత్తానికి పరుగులు ఆగలేదు
అలసట లేదు


- కందాళై రాఘవాచార్య
9790593638

### ఎవరు నీవని

గతుకుల జీవితంలో గమకాలు పలికి
వెలిసిన దృశ్యాలకు ఆశల వెల్లవేస్తాను
వెతలతోటలో వెలిగే వెన్నెల దీపమై
కలల రాతిరిని కానుక చేస్తాను.

వెలుతురులేని బతుకుల్లో
మానవతను దీపకాంతిని చేస్తాను

చిగురించని బతుకుచెట్లకు
జీవన ఎరువవుతాను.

ఒంటరి ఎడారిలో ఊసుల ఒంటెనై
గమ్యం చేర్చుతాను
గాయపడ్డ మనసుకో గోరువెచ్చని
సాంత్వన స్నానం చేయిస్తాను.

ఎగిరేపక్షి రెక్కల మాటున
వీచేగాలి స్పర్శ చాటున
ఉదయరాగమై పలకరిస్తాను
నీ హృదయగానమై అవతరిస్తాను.

ఎవరంటూ వెతికావా
ఎక్కడంటూ చూసేవా
నీలోనే దాగున్నాను చూడు
తట్టిలేపావా..
నీ ఆత్మవిశ్వాసమై పలుకుతాను


-సి.యస్.రాంబాబు
8374818961

### తస్మాత్ జాగ్రత్త

కన్న పేగులను చూసే కన్నులను
మత్తుల ముందు నిలబెట్టి

ఆలోచన కరువైన మనసులను
సంత లో బేరం గా పెట్టి

మార్గం ఉన్నా సున్నిత నడక లో
భవిత తాకట్టు పడి
విలవిల లాడుతున్న సమయం

ప్రేమలు పొంగిన నేల పై ద్వేష గాలులు
సువాసనలు గుబాలిస్తాయని భ్రమిస్తే

అస్తిత్వ చిరునామా
లెక్క లేని కన్నీటి భవితలను చూడాలి

మనసు పై జరిగే తెలియని దాడి
నిన్నూ వదలదు

పూలన్నీ కోసి రక్తపు బొట్లను
మిగిలిచ్చినపుడే
నీ మత్తు దిగి కండ్లు
తెరుచుకుంటాయి నువ్వప్పుడు
ఎంత వెతికినా ఏదీ కనిపించదు
ఎగిరొచ్చిన రాబందు గీసే
కర్కశ పాదాల గోళ్లు తప్ప


-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## 'కథ 2020' సంకలనం ఆవిష్కరణ



'కథ 2020' పుస్తకావిష్కరణలో మధురాంతకం నరేంద్ర, కె. శివారెడ్డి, వాసిరెడ్డి నవీన్, ఆడెపు లక్ష్మీపతి, నర్సిం, గీతారామస్వామి తదితరులు.

ఇతర భాషలకు తీసిపోని విధంగా తెలుగు కథ ఎదిగిందని సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత కవి కె.శివారెడ్డి అన్నారు. మానవ జీవితంలోని అన్నీ పార్శ్వాలను ప్రతిబింబిస్తున్న తెలుగు కథ కొత్త సరిహద్దులోకి ప్రవేశించిందని ఆయన కొనియాడారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథాసాహితి 31వ సంకలనం 'కథ 2020' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కె. శివారెడ్డి మాట్లాడుతూ గత మూడు దశాబ్దాల్లో సమాజంలో చోటుచేసుకున్న సామాజిక, సాంస్కృతిక పరిణామాలకు కథా సాహితీ సంకలనాల్లోని కథలు అద్దం పడతాయన్నారు. మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ డిజిటల్ మాధ్యమాల వేదికగా వస్తున్న కథల్లో ప్రమాణాలు లోపిస్తున్నాయని, అందుకు కారణం అక్కడ సంపాదకుడు అనే గేటు లేకపోవడమే అని వ్యాఖ్యానించారు. సాహిత్య ప్రమాణాలు పెంచడంలో కథా సాహితీ కృషి ప్రత్యేకమైందని కొనియాడారు. కథా సాహితీ సంకలనాల్లో చాలా వరకు 'ఆంధ్రజ్యోతి' అనుబంధంలో ప్రచురితమైన కథలున్నాయని ఆయన పేర్కొన్నారు. కథా సాహితీ సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ కథా లోకంలోకి వచ్చిన కొత్త రచయితలు ప్రస్తుతం సంధి దశలో ఉన్నారని అన్నారు. వెబ్ మ్యాగజైన్ల లోనూ నాణ్యమైన కథలు రావాలని ఆకాంక్షించారు. సభాధ్యక్షత వహించిన ఆడెపు లక్ష్మీపతి మాట్లాడుతూ తెలుగు కొత్త పుంతలు తొక్కుతోందనడానికి కథా సాహితీ సంకలనాలే నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో హైదరా బాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకురాలు గీతా రామస్వామి చిత్రకారుడు నర్సిం, రచయితలు బమ్మిడి జగదీశ్వరరావు, కుప్పిలి పద్మ, మహమ్మద్ ఖదీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## చర్నాకోల!

పంచభూతాత్మక ప్రకృతి ప్రాణప్రదాయిని!
తల్లిలాంటి చల్లని ప్రకృతి ఆగ్రహిస్తే
మనకు భూమిమీద నూకలు చెల్లినట్లే సుమా!
నవీన సమాజ దురాశ,స్వార్థపు
మానవ నడిమంత్రపు పాచికలాటలో
ప్రశాంత ప్రకృతికి అడుగడుగునా గండాలే!
కళ్లెర్రజేసిన ప్రకృతి సంజీవిని పగబట్టి
తోక తొక్కిన త్రాచులా బుసలు కొడుతూ
జన జీవనాన్ని అతలాకుతలం చేస్తూ
అకాల వర్ష క్రోధాగ్ని వరద పోటుతో కాటేస్తోంది!
అంగుళం వీడని మన బకాసుర భూ ఆకలిని
మానవ తప్పిదాల చిట్టాలో రాస్తోంది!
గతి తప్పిన ఋతుచక్రపు దాడితో
స్వయంకృతాపరాధ శిక్షను అమలు చేస్తోంది!
భూతాప అగ్నికీలా జ్వాలాపర్వంతో
పృథ్విపై మన మనగడను ప్రశ్నార్థకం చేస్తోంది!
ఉపద్రవాల కత్తుల బోనులో నిలబెట్టి
గుణపాఠ దండనల తీర్పు తీరుస్తోంది!
అమూల్య ప్రకృతి అమృత తుల్య ప్రాణశ్వాసే
సకల జీవరాసుల భవితవ్యపు నుదిటి రాత!



-వంగర. పరమేశ్వరరావు
9491400534

## వెలుగు చూడని మాణిక్యాలు

ఎన్ని సుడిగుండాలను భరిస్తున్నావో
ఎన్ని సునామీలను గుండెలో దాచుకున్నావో
ఎన్ని గతించిన బాధా పార్థివాలను మోస్తున్నావో
సముద్రంలా గంభీరంగా సాగిపోతున్నావు.

మస్తిష్కపు భాండలిలో ఆలోచనల తాళించి
సంఘపు సంస్కరణల పునరుద్ధరణ కోసం
వెలుగు, నిశిలను మరచి వేదనపడుతూ
తెలిసిన లిపిలో తెలపాలని తంటాలు పడుతున్నావు.

బిచ్చగాని జోలెలా ఖజానాల నిలయం
తాళపత్ర విలువకు తగ్గని తెల్లని కాగితం మీద
నీలిరంగు రక్తపు ముద్రలు పేర్చుకున్నాడు
దోచలేని ఆస్తిని భద్రంగా దాచుకున్నాడు

ద్వాపరం నాటి కుచేలుని వారసత్వాన్ని పోగేసుకుని
పిడికెడు కండలేని దేహానికి మంచినీటి ఆహారమందిస్తూ
అచ్చుకు నోచని అక్షరాలను పంచిపెట్టుకుంటూ
నడుస్తున్న శవంలా మెట్లెక్కి దిగుతున్నాడు.

సరస్వతి నమ్ముకోను తప్ప అమ్ముకోలేని వాడు
కడుపులో ఆకలి కంజెర ధ్వనికి తలవంచాడు
అలసిన దేహం అర్థాంతరంగా అదృశ్యమయింది
ఎగిరిపడ్డ అక్షరం పార్థివ దేహంతో మమేకమయింది.

తరాలు మారుతున్నాయి, తలరాతలు మారలేదు
ఆస్తులు కరుగుతున్నాయి, ఆదరణలు పెరగలేదు
కవులు మారుతున్నారు, గతులు మాత్రం మారలేదు
వారెప్పుడూ అభాగ్యులే, వెలుగు చూడని మాణిక్యాలే



-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## బతుకు పుస్తకం

బతుకు పుస్తకం రాస్తున్న
భారమైన పదాలనడుమ
కష్టాన్ని మరువాలనే
తాపత్రయం లో
బతుకు బండి నడుపుతున్న
ఎదురైన స్టేషన్లలో
ఎక్కి దిగే ప్రయాణికులతో
సిగ్నల్ ఇవ్వక ఆగిన తరుణంలో
ఎదురైన సంఘటనలలో
చక్రాల బండి పట్టాతప్పిన
కనులముందు పోయే వారి
సంఖ్య లెక్కించుకుంటూ
వరదల భీభత్సంలో
తుఫానుల సమరంలో
ఈతరాక ఈదలేక
గట్టుకోసం వెతుకులాటలో
దొరికిన ఆసరాయే అదృష్టంలా
రాలిపోయే కాలానికి
ఎదురుచూపు మాని
రాస్తున్న ఎలా ఎదురీదాలో
నేర్పాలనే ఉస్తుకతతో....



-పినపాల.విశాలాక్షి
9908435805.

## ప్రకృతే ప్రాణ మిత్రులు

సముద్రయానంలో దాహం
పనికిరావు కదా కడలి జలాలు
చుట్టూ జనసంద్రమే ఉంది
నా అనే వారెవరు కానరారు
షరతుల అనుబంధాలు
స్నేహాలన్నీ అవసర లీలలు !

బెల్లం చుట్టూ ఈగల్లా..
ధన దాహపు చుట్టపక్కాలు
మానవ సంబంధాలన్నీ..
ఈర్ష్యా అసూయల కేంద్రాలు
ప్రకృతి హరిత వస్త్రాపహరణ చేసే..
అసుర నవ నర సమూహాలు !

పరహితమే నేరమన్న వేళలు..
స్వాహాలే ఆధునిక నియమాలు
భావ కాలుష్య సమాజ ఎడారిలో..
దాహం తీర్చే నా వారే కరువు
వెతకొద్దు శ్రేయోభిలాషుల్ని..
నిరాశ పడొద్దు దొరకలేదని !
భావోద్వేగాల ఆస్తులే..
జీవనయాన ఇంధనాలు
నా నేస్తం ఒంటరితనం కాదు..
నా చుట్టూ ప్రాణవాయువు
సుజలాల అక్షింతల జల్లులు
ఈ మట్టే నా మాతృమూర్తి
సన్నిహితుడే నా అంతరాత్మ !

నేను ఒంటరిని కానే కాను
పంచభూతాలే నా ఆరో ప్రాణం
సూర్య చంద్రులే నా స్నేహితులు
చెట్టుచేమల అందాలే నా నేస్తాలు
నా చుట్టూ సహజ హిత హస్తాలే !

-మధుపాళీ
9949700037

## గగన చుక్కలు

మూగ మనసులోభావాలను
మౌనగీతాలతో అలరించు
కడలి తరంగ ఊహలను
కలము సిరాచుక్కనొలికించు

ఉవ్వెత్తున ఎగిసిపడే జ్వాలలు
హలము పట్టి కాగితంపై చల్లు
మదిఊటలో జలువారు జలాలను
దివ్య కలశంలో అదిమి పట్టు

ఆలోచనల కవ్వమాడించి
హృదయ గాయాలను మాన్పించు
నవనీతపు కవనాలు లిఖించి
బీడుఎదలో అమృతం కురిపించు
పెదవి దాటని పలుకులతో
గుండె కావాట రెక్కలు విప్పు
అంతరాత్మ ప్రభోదాలతో
అనంత సృజన పురివిప్పు.

ఆలోచనా ఝరీ ప్రవాహాలను
సాహితీ గగన చుక్కలుగ మొలిపించు
గడ్డ గట్టిన భావ మేఘాలు
వర్షధారలైన తెలుగునేల పులకించు



-పోతుల చైతన్యభారతి
7013264464

## తెల్లారంగనే

ఆవేశాలు, ఆవేదనల ఎంగిలి విస్తరాకులు
చెత్తకుండీలో పదిలంగా పడేసి
హాయిగా రాత్రిని జోకొట్టి
తెల్లారక ముందే నిద్రలేస్తామా
మనస్సులో ప్రశాంతత పదిలంగా
ఉత్తేజ పవనాలు మెల్లమెల్లగా
పూలు విచ్చుకున్నట్లు ఆలోచనలు
పనికిరానివి
వదిలించుకోవడానికి కాలకృత్యాలు.

ఒక్కొక్క పదం ఏరుకోవడం మొదలుపెడితే
రాతలు, కొట్టివేతలు, దిద్దుబాట్ల మధ్య
కలం కాగితం నిండు గర్భిణిలా పోరాటం
పాచిపోయిన పదాలు వదిలించుకోవడానికి
బ్రష్ చేసుకోవడం
కళ్ళ బూసులు వదిలించుకొని
అక్షరాల చూపు సారవంతం చేసుకోవడం.
గంతలు వదిలేసుకుని
శీర్షిక ప్రపంచం చుట్టూ
గానుగెద్దులా తిరిగితేనే
అవసరమైన ఆహారం పలకరిస్తుంది
మలిన పదాలు వదిలించుకునేందుకు
భావాల నీళ్లలో మునిగి తేలి,
స్నానం చేయాలి

శరీర శుద్ధి తర్వాత
దేవునికి దండం
పెట్టుకుంటామో లేదో కానీ
అంతరాత్మ ఒకసారి దర్శించుకోవాలి
చేసిన తప్పులు రబ్బర్ తో మలివేయాలి
ఉత్తేజ పవనాల ప్రాణవాయువు పీలిస్తేనే
కలం కదలికల చేయికి ప్రశాంతత
కడుపునిండా తిన్నంత తృప్తి



-కొమురవెల్లి అంజయ్య
సెల్..9848005676

## అంతర్మథనం

లోలోన ఆలోచనల
పర్వం సాగుతుంది
భావాల పరంపరను తోడుతూ
ఫోటోపై ఫోటో ప్రింటులా
అనేకానేక ఊహల ఊసులు

ఊపందుకుంటున్నాయి
ఎంపిక అసాధ్యమే ఐనా!
ఎక్కడో ఫుల్ స్టాప్ కామాలా
లీలగా ఒకానొక స్థితిలో స్థిరీకరణ
కలం కదలికతో మొదలు
భావాల రూపకల్పన
కొన్ని సార్లు టైటిల్ కోసం
ఇంకొన్ని సార్లు టాపిక్ కోసం
కసరత్తు షురూ
నాగరికత నాణ్యత నవీనత
సాంకేతికత ప్రయోగాత్మకత
సూచన వర్ణనల జోడింపులతో
కూడిన సమయోచిత కసరత్తుకు
ప్రతిఫలం ప్రతిరూపును
చూసినంతనే
నూతనోత్సాహంతో
మరోరచనకు స్ఫూర్తి,
అన్వేషణా కొనసాగు
అనేకానేక బాధ్యతల
బంధీగా ఉన్నా ఈ కాస్త
శోధన సాధన మనసుకు
నిచ్చు ప్రశాంతత
ఈ అభిరుచి ఇలాగే
కొనసాగించాలనే ఆకాంక్ష ఆతురత



-సంధ్య సుత్రావె,
9177615967

## (వ) ద్దన్నా (రే)!

వరి కాదా సిరి!
ఎందుకు ఈ కిరికిరి!
ఆధునిక యుగంలో
అన్నదాతకు తప్పని
పురిటినొప్పుల పంట తిప్పలు!
కప్పల బెక బెకల అరుపులతో
కనక వర్షం కురిసి
కర్షకుని కష్టాలు తీరవు!
అవస్థలు తీర్చే వ్యవస్థ కావాలి!
హలము - కలానికి కథల
కలహమెందుకు?
హలము కదిలితేనే గదా
కాలము ముందుకు సాగేది!
ఏ మడిలో ఏ సిరులు కురియునో
ఏ మెరకలో ఏ మెతుకు పండునో
ఏరుదాటి తెప్ప కాల్చే వారికేమెరుక!
మడిని గుండె గుడిగా మలచి
శ్రమ చెమటల సమరులు పోసి
ఆశల కోరికల వత్తులు వేసి
దీపం పురుగుల చెర దాటి
పసిడి పంటల వెలుగులతో
ఆకలి తీర్చేఅన్నదాతకు తెలుసు!
అమ్మ అలిగితే ఆకలి విలువ తెలిసేది!
పుడమి పుట్టినప్పటినుండి
గిట్టుబాటు కాని బక్క రైతొక్కడే!
మీకేమి తెలుసు! (వ)ద్దన్నా(రే) !



- పి.బక్కారెడ్డి
9705315250

## ఊసులు

ఎద సొద తీరి
అల్కగైంది
నిండు జాబిలితో
ఎన్నీల ముచ్చట్లలో

కనుల వనంలో
ఎన్ని కలల పూలో
హాయిగా విచ్చుతూ
మగత లో రాలే

రోజూ కొత్తె
నింగివనంలో జాబిలిపూవు
కండ్ల సాగరాన
కలువై పూస్తూ.

నిద్రను మింగింది
రేయమ్మ
పున్నమి జాబిలితో
కంటి బాసలకై

కలత నిదుర
చెదిరిందా
నింగివైపు చూడు
హాయిని నింపు నెలరేడు

జాబిలితో
ఊసులాడే కండ్లు
దూరదేశంలున్న
బిడ్డచూపుల్ల వారధని.

ఊసుల మూట
కట్టిచ్చా
ఈదున్న చంద్రునికి
ఆదున్న బిడ్డకందించమని.



-వకుళ వాసు
9989198334

## చితికిన నేతన్న బతుకులకు అద్దం పట్టిన "మొగ్గలు"....!

ప్రపంచీకరణ నేపథ్యంలో అతలాకుతలం అవుతున్న నేతన్న బతుకులకు అద్దం పడుతూ కవయిత్రి పులిజమునగారు 'నేత మొగ్గలు' గ్రంథాన్ని ప్రకటించారు. గతంలో 'నీలో నేను' పేరుతో ప్రేమ మొగ్గలను వెలువరించిన అనుభవం ఆమెకు ఉంది. కవి డా॥భీంపల్లి శ్రీకాంత్‌గారు సృష్టించిన "మొగ్గలు" ప్రక్రియ వర్ధమానులు-ప్రవర్ధమానులతో ఆదరించబడటం ఆనంద దాయకం.

చేనేత కార్మికుల శ్రమైక జీవన సౌందర్యాన్ని..పద్మశాలి వంశ ఔన్నత్యాన్ని, ఆ వంశం యొక్క వారసులైన చేనేతల ప్రతిభా పటవాలను.. వృత్తి నైపుణ్యాలను ఈ గ్రంథంలో కవయిత్రి పులిజమునగారు ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. భృగుమహర్షి, అతని కుమారుడు దాత మహర్షి, క్రమంగా విదాత మహర్షి, మృకండ మహర్షి, మార్కండేయ మహర్షి, భావనా మహర్షి, అతని సంతానమైన 101 మంది ఋషులతో పద్మశాలి వంశం ఉద్భవించిన విషయాలను ఇందలి 'మొగ్గలు'లో నిక్షిప్తం చేశారు.వంశ పరిణామక్రమాన్ని ఆవిష్కరించే క్రమంలో చారిత్రక అంశాలను బాగానే ప్రస్తావించినప్పటికీ.. కవిత్వాంశ అక్కడక్కడ కొరవడకుండా చూస్తే బాగుండేది.

నేతన్నల వెతలను తెలియజెప్పేందుకు 'మొగ్గలు' ప్రక్రియను ఎంపిక చేసుకుని కవయిత్రి పులి జమునగారు



ఆర్ద్రంగా తమ భావాలను మనతో పంచుకున్నారు.

'సాంకేతిక విజ్ఞానం ఆగమించినందుకే
శిథిలమై చతికిలపడిన చేనేత మగ్గం
అదుపు తప్పిన నేతన్న బతుకు పగ్గం"

అంటూ చితికిన నేతకారుల బతుకులను 'మొగ్గలు'లో ప్రతిబింబింపజేశారు.

**'దారమే నేతన్నకు ఆధారమవుతూ**
**మగ్గం గుంతలోనే జీవితమంతా**
**చేనేత జీవితం దారం తెగిన గాలిపటం'**

అంటూ కవయిత్రి తమ ఆవేదనను వ్యక్తపరిచారు.

**"నేతన్న చేతిలో రూపుదిద్దుకున్న వస్త్రమే**
**ఆత్మ గౌరవాన్ని హుందాతనాన్ని ఇచ్చేది**
**నేత కార్మికుల జీవితాలిప్పుడె చిని గిన బతుకులు"**

అంటూ మరో కవితలో కవయిత్రి తమ బాధను ప్రకటించారు.

తరతరాలుగా చేనేత వృత్తినే నమ్ముకుంటున్న నేతన్నలకు మిగిలింది నెత్తిన అప్పుల కుప్పలే కృంగి కృశించి అర్ధాకలితో అలమటించే నేతన్నలు అంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన నేతకారుల వెతలను ఆవిష్కరించారు.

దారాలను చిక్కుదారంతో గడుపుతూనే కుటుంబ చిక్కుల్లో చిక్కి శల్యమైన బతుకులు చిక్కులు పడ్డ దారం తీరు నేతన్నల జీవితాలంటూ మరో కవితలో పేర్కొన్నారు.

శుభ కార్యాలలో శోభాయమానమైన పట్టుచీరలు ధగధగ తళుకులీనుతూ కనువిందు చేస్తాయి. చేనేత కార్మికుని జీవితం మాత్రం కటిక చీకటి అంటూ కవయిత్రి వాపోయారు.

ఇకనైనా చేనేత పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తును కల్పించాలని.. మోడు వారిన జీవితాలలో ఆశల చిగురులు తొడగాలనీ.. శ్రమ దోపిడీ నుండి వారిని రక్షించి వారి బతుకుల్లో వెలుగులు నింపాలని కవయిత్రి జమునగారు కాంక్షించారు.

ప్రపంచీకరణ కష్టాల నుండి చేనేత కారులను ఆదుకోవాలనీ చిత్తుగా పతనమైపోతున్న చేనేత పరిశ్రమను కాపాడి.. సంప్రదాయ వారసత్వ సంపదకు పూర్వ వైభవాన్ని తేవాలని చక్కని సందేశంతో ఇందలి 'మొగ్గలు'ను తీర్చిదిద్దారు..

అక్కడక్కడ కొన్ని మొగ్గలు.. కవిత్వాంశ లేక.. బలహీనంగా పూర్తి వచనంలో కనబడ్డప్పటికీ.. చేనేతకారుల జీవితాలను.. వారి బతుకుల్లోని వెతలను.. పొందుపరుస్తూ విలువైన సమాచారాన్ని 'మొగ్గలు' ప్రక్రియలో ఆవిష్కరించారు. మున్ముందు పూర్తిస్థాయి వచన కవితా సంపుటితో రాగలరని ఆశిద్దాం...

ప్రతులకు: పులి జమున
202, శ్రీయ ప్లాజా అపార్ట్‌మెంట్
రైల్వేస్టేషన్ రోడ్,
మహబూబ్‌నగర్-509 001.
సెల్: 8500169682



- దాస్యం సేనాధిపతి
94405 25544

పుస్తక సమీక్షలు

## మనసులు చెబుతోన్న 'మంచి' కథలు





అందరు రచయితలు వారి వారి మనసులు చెప్పిన కథలు వ్రాస్తారు. సంకలనకర్తలు డా॥పాతూరి అన్నపూర్ణ మరియు వడలి రాధాకృష్ణగారలు సేకరించిన ఈ 51 కథా రచయితలు, రచయిత్రులు మరింత మనసు పెట్టి వ్రాసారు. కథ, కథనం, ఎత్తుగడ, ముగింపు అన్న నాలుగు ప్రక్రియలు ఒక కథను అల్లటానికి ముఖ్యమైన అంగాలు. వీటన్నింటికి సమన్వాయం చేకూర్చినపుడే కథ ' పండుతుంది'. పాఠకుల హృదయాల్లోకి చొచ్చుకుపోయి స్థిరంగా తిష్ట వేస్తుంది ఆ కథ. ఒకటి, రెండు సన్నివేశాలను కొన్ని పాత్రల ద్వారా దృశ్యమానం చేసి. అనుభవసారాన్ని జోడించి, 'ఇది యాదార్థమే' -అన్నంత సహజంగా వ్రాయగలగటం ఒక మంచి కథకు నిర్వచనంగా చెప్పుకోవచ్చును.

ఈ సంకలనంలో కనిపించే 51 రచయితలు చేయి తిరిగిన వారే! బాలి, భువనచంద్ర, జలంధర, మేడా మస్తాన్ రెడ్డి, పాతూరి, వడలిపెబ్బిలి, హైమవతి, డా॥పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి-ఒక్క వీరలే కాదు! సంకలనంలోని కథ కులకులందరూ కథలకు న్యాయం చేకూర్చారు.

స్థాలీపులాక న్యాయంగా కొన్ని కథలు

అమెరికాలో ఉద్యోగం డాలర్ల సంపాదన మనిషికి ఆర్థిక బలం చేకూర్చుతాయి గాని, సంతృప్తిని చేకూర్చలేవు. సంతృప్తిలేని జీవితం, అగమ్యం. నిస్సారం, నిరర్థకం. ఇది గ్రహించిన విజయ్ ఇండియాకు వచ్చి, తను ఆర్జించిన విలువిద్యా నైపుణ్యం గిరిజన తండాల్లోని పిల్లలకు నేర్పాలనుకుంటాడు. భర్త మనసెరిగిన ఆ భార్య విజయ్‌కు మనసా, వాచా, కర్మణా సహకరిస్తుంది. బంధువులు తేలిక చేసి మాట్లాడినా, విజయ్ దంపతులు స్థయిర్యం వీడక తమ ఆశయాన్ని కొనసాగించి, చివరకు ద్రోణాచార్య అవార్డును విజయ్ చేజిక్కించుకుంటాడు. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధ్యం కానిది ఏదీ లేదన్న ఆశావాదిని సమర్థించే కథ అద్దేపల్లి జ్యోతి 'గెలుపు పిలుపు'.

అందరూ మనక్కనిపిస్తున్న పరిసరాలు, ప్రజల మధ్యే బ్రతకాలి. కాని కొందరు మాత్రం తమ తమ నైపుణ్యాన్ని కనబరిచి, పనులు కానిచ్చుకుంటున్నారు. ప్రతి గదికి ఎక్కడో ఓ చోట తలుపులున్నట్లు ప్రతి సమస్యకు పరిష్కారం అక్కడే ఉంటుంది. చేయాల్సిందల్లా, బురిడీ కొట్టించాడు . కథలోని జయరాంలా తామున్న పరిస్థితులను శ్రద్ధగా పరిశీలించి పరిష్కారం కనుక్కోవాలి అని చెబుతుంది ఈ కథ. రచయిత ఎ.రాఘవేంద్రరావు తెలివిగా ఆలోచించి తన పనులు చక్కబెట్టుకోగలిగాడు. ఎంతోకొంత ఇతరులకు కూడా సాయపడగలిగాడు. చక్కటి ప్రబోధాత్మకమైన కథ ఇది.



సంసార నౌక సాఫీగా సాగాలంటే, ఎదురయ్యే ప్రతీక్షణాన్ని బేరీజు వేయాలి. 'సమస్యల్లోంచే సమాధానాలు వెదకాలి' అని చెప్పే కథ ఎ. రాజ్యలక్ష్మిగారి 'సంసార నౌక' కథ. అందరి ఇళ్ళల్లో ఉండేవే ఆర్థికావసరాలు, పిల్లల పెళ్ళిళ్ళు, గుట్టుగా సంసారాన్ని నెట్టుకురావటాలు. భార్య మలమ్మ ఆదేశాల మేరకు భర్త రాఘవయ్య సంసార నౌకని ఎలా నడిపించాడో చెబుతుంది ఈ కథ. రచయిత్రి కథల నైపుణ్యాన్ని ఆసాంతమూ, అడుగడుగునా పాఠకులు ప్రశంసించకుండా ఉండలేరు. రాఘవయ్య ఆఫీసుకు వెళ్తూ, పూజగదిలో స్వామికి ఒక నమస్కారం. అలానే ఒక గంప కుటుంబ అవసరాల లిస్టును అప్పగించి, తేలికయిన మనసుతో తన బ్రతుకు బాటల గుర్రం- అదే- టూ వీలర్ ఎక్కుతాడట! ఆఫీసులో ఆయన 'పద్ధతుల రాజు. రూలు పుస్తకం నిలువు, వెడల్పు, మందం ఆయన చేతి గంధం' అట! ఆయన భార్య కమలమ్మ ఆయన రూళ్ళకు దొరకకుండా, పిల్లలను సవరించి పొద్దు గడిపిస్తుందట!(పే.30) రాఘవయ్య పెళ్ళి మధ్య తరగతి పద్ధతులతో సజావుగా జరిగిందట! పెళ్ళి చేయటం జెండా వందనం లడ్డూలు పంచటమంత సులభమట! చదవటం మొదలు పెడితే ఆసాంతం చదవకుండా ఉండలేని కథ ఇది.

అకారాది క్రమంలో చెప్పిన పై కథలే కావు, మిగతావన్నీ కూడా మేలిముత్యాలు. జాతిరత్నాలు. సుప్రసిద్ధ సినీ గేయ రచయిత భువనచంద్ర తన 'మనసులోని మాట'లో సెలవిచ్చినట్లు- 'సాహితీ బంధువులందరూ ఒకేచోట ఒకే పుస్తకంలో కలిసి మెలిసి జరుపుకున్న పండగ. మళ్ళీ మళ్ళీ ఇలాంటి పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించే పండగ. సంకలన కర్తలకు అభినందనలు.

**ప్రతులకు:** పాతూరి అన్నపూర్ణ
నెల్లూరు. సెల్: 94902 30939



- కూర చిదంబరం
సెల్: 8639335675

## నడివయసు నాన్న

నాన్న ఓ నాన్నా
మోయలేని బరువులెన్నో మోసాను
బాధలేని బాధ్యతలెన్నో భరించాను
చూశాను పిల్లల్ని ఉన్నత శిఖరాలలో
విడిచాను నిట్టూర్పులు ఎన్నో అలిపిరి మెట్లలో

నాన్న ఓ నాన్నా
తండ్రి విలువ తెలుపమని
నీ తలపుల్లో బోరుమని విలపించాను
ఆ తండ్రికి ఈ తండ్రి ఎలా గోచరించనో
తెలిపాడు ఆ తిరుమలేశుడు
తండ్రి తలపులు ఎటు నుండవలెనో ?!

నా పిల్లలు నా పిల్లలు కారని
నా ద్వారా పుట్టారన్నది నిజమని
నా నుంచి కాదన్నది సత్యమనీ
ప్రకృతి పుత్రులనీ శ్రీవారి సంతానమనీ
ప్రేమ పంచాలని ఆశించకూడదనీ
తెలిపాడు తిరుమలేశుడు
తండ్రి తలపులు ఎటు నుండవలెనో ?!

నాభావాలు నాకు మాత్రమే సొంతమనీ
వారి భావాలు వారికుంటాయనీ
నాలా ఉండాలని కోరుకోకూడదనీ
నా ఆలోచనలు నావి మాత్రమేననీ
నాలా వారు ఆలోచించాలన్నది వెర్రితనమనీ
తెలిపాడు తిరుమలేశుడు
తండ్రి తలపులు ఎటు నుండవలెనో ?!
నేను వారి శరీరానికి రక్షకుడనీ
వారి ఆత్మకు పరిరక్షకుడను కాదనీ
జీవితమనే విల్లు నేననీ
విల్లు నాదని బాణం నాది కాదనీ
ప్రాణమున్న బాణానికి లక్ష్యం వేరనీ
తెలిపాడు తిరుమలేశుడు
తండ్రి తలపులు ఎటు నుండవలెనో ?!

నాన్నా ఓ నా నాన్నా
తండ్రి లేని తనయుడికి
తండ్రి కాని ఆ తనయుడికి
ఈ తండ్రి ఎలా గోచరించనో
నాకు నడివయసులోనే
అవగతమైంది నాన్నా ఓ నా నాన్నా!!!



-కందాళం రజనీకృష్ణ
9487708043

## రాజకీయ క్రీడలో రైతు గతి ఎటు?

రైతు పంటకు రాజకీయ చీడలు
రైతు కష్టాన్ని తీర్చేదేవరు..ఓదార్చేదెవరు?

ఇవి గురివింద ఆర్భాటాలా లేక
ఊసరవెల్లి రంగుల రాట్నాలా
వరి తప్ప వేరే పండని రైతు లకి ఉరేనా!
ఊరట లేదా!!

అన్నం పెట్టే రైతన్నను అందరూ కలిసి
సున్నం పెడతారా?

ఈ నక్క జిత్తుల వ్యవహార దాగుడు మూతలు రైతు
కంఠం ముందు వ్రేలాడే కత్తేనా?

సాగు చేయడమే నష్టం కలిగే ఈ రోజుల్లో
అన్నం పెట్టే రైతన్నకు మిగిలేవి కష్టాలేనా?
చిన్న పిల్లల చాడీల చెలగటంలా
మన రాజకీయ వ్యవస్థ
ఇది రైతు సేవా దాతృత్వ పు ఔదార్యమా?
రాజకీయ రంకులో నలిగి పోతున్న
రైతు బతుకు ఆగమేనా?

రాజకీయ చదరంగపు
క్రీడలో పావులైన రైతులకు భరోసా ఎవరు?
చెప్పండి దద్దమ్మలార?



-దేశిని శ్రీధర్
9849818284

## కసి తీర్చుకుంటాను

ఏంటది ఆ రంగు?
అమాంతం మనిషిని
చీకటి చాపతో చుట్టేస్తుంది.

అంత బలమేంటి దానికి?
ఒక్కసారిగా గ్రహణం పట్టినట్టు
కొండచిలువ మింగేసినట్లు
జీవితపు రంగులన్ని వెలిసి పోతున్నాయి.

గుండె గూట్లో ఉన్న పక్షిని
బయటకు లాగి రెక్కల్ని ఉరిపోసి
రక్త సంబంధాల్ని ఆవిరి చేస్తుంది
పవిత్ర ప్రేమ గులాబీల పీకలు కోసి
పరువు కత్తుల దాహాన్ని తీరుస్తుంది.

ఎక్కడిది అది
నల్లని నలుపు రంగు
ప్రపంచమంతా పాములా పాకుతుంది
తెల్లటి శాంతిని, ఎర్రటి నిప్పులను సైతం
నోట్లో వేసుకుని మింగేస్తుంది.

అటు ఇటు తిరుగుతూ
పచ్చటి ప్రకృతిని ముక్కలు చేసి
శ్వాస గొంతు నులిమి
గాజు సీసాల్లో బంధిస్తుంది.

స్విస్ బ్యాంకుల్లో దాక్కుని దాక్కుని
రాకాసి అలల్లా ఎగసిపడుతూ
అభివృద్ధి కాళ్ళను వెనక్కి లాగి
గమ్యం లేని మార్గాన ఒంటిగ నడిపిస్తుంది.

దానికసలు మానవత్వపు
రంగు లేనట్లుంది, వికటాట్టహాసం చేస్తుంది
ఎవడికి పుట్టింది, ఎవడు పుట్టించాడు?
కనబడితే ఆ నల్లరంగు మొహానికి
మసిపూసి కసి తీర్చుకుంటాను.

-శ్రీతరం

## కాలం

క్షణాలు తక్షణమే కరుగుతుంటే...
నిమిషాలు మిషలతో వ్యర్థం అవుతుంటే...
రోజులు బూజులు పడుతుంటే..
గంటలు జంటలుగా తరిగి పోతుంటే....
నెలలు అలలుగా విరిగి పడుతుంటే..
సంవత్సరాలు గతం అనే కాలసముద్రంలో
కలిసిపోతుంటే....
కాలం కరిగి,
యవ్వనం మరిగి ఆవిరైపోతుంటే..
వృద్ధాప్యం వాయువేగంతో పరిగెడుతుంటే..
జీవితం చిన్నదా? పెద్దదా?
ఎన్నో ఆనందాలు, ఆవేశాలు,
కోపాలు, తాపాలు,
పాపాలు, పుణ్యాలు.
వ్యర్థపు ఆలోచనలు,
పనికిరాని సమాలోచనలు,
ప్రేమలు, పగలు, బాధలు, భయాలు,
పుట్టుకలు, గిట్టుకలు,
లక్ష్యాలు, నిర్లక్ష్యాలు.
ఆస్తులు పెరుగుతాయి
లేదా తరుగుతాయి.
కాని, శరీరంలోని
అస్థులు మాత్రం కరుగుతాయి.
జీవిత జ్ఞాపకాలు పెరుగుతాయి,
మెదడంతా సుడులు తిరుగుతాయి.
జీవిత లక్ష్యమే లేని ఓ నిర్లక్ష్యపు మనిషీ ,
ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే,
నీ విజయం ఎప్పటికీ తిరిగిరాని
ఒక జీవిత కాలపు లేటు.

-నాగరాజు.చుండూరి
7799213213

## అంతులేనిది ఆశా....!!

అంతులేనిది మనిషి ఆశ
విసిరినాడు కోరికలు
అనంతము ఆకాశంలోకి
జ్ఞానంతో నింగిని నేలను ఏలుతూ
ఎదిగినాడు మానవుడు మహావృక్షం లాగా

ఆశల వలలొచిక్కి గిలగిలా కొట్టుకుంటూ
తనువంతా విషం చిమ్ముతూ
కృత్రిమ మనసుతో ప్రేమలు పంచుతూ
అనుబంధాలను తుంచి
మనీ బంధం పెంచేను...

మానవత్వపు ముసుగు బిగిస్తూ
అద్భుత నటనలతో జీవిస్తూ
కూటి కొరకు కోటి విద్యలు నేర్పిస్తూ
కన్నీటితో కూడా కాసుల రాల్చుతూ...

ముందర మంచిని నటిస్తూ
మన వెనకనే గోతులు తవ్వుతూ
విషముతో నేలపై ప్రాకుతూ
పైకి పాల వలె కనిపిస్తున్నాడు...
నిరాశను ప్రతినిత్యం ప్రదర్శిస్తూ
అవసరానికి అన్నిటిని తుంచుతూ
లేని ప్రేమలను మాటలతో పంచుతూ
మేడలో కూలీ వాడిగా జీవిస్తున్నాడు..

తల్లిదండ్రుల హృదయాలను చిదిమేస్తూ
వారిని వృద్ధాప్యంలో తల్లడిల్ల చేస్తూ
కన్న ప్రేమకు విలువ కడుతూ
కసాయి వాడిలా
వృద్ధాశ్రమాల తోలుతున్నాడు.

తొందరగా ఎదగాలని తొందరెక్కువ
ఎదుటి వారిని ముంచాలనే ఆరాటం
చిన్న చేపను పెద్ద చేప మింగినట్లు
భూమినే శాసించాలని ప్రయత్నము...

మనిషి మనసు విసిరే మెత్తని మాటలు
అవి పుండై మండే ఎండల్లో కారంగా
కపటపు తోలును కప్పుకొని
కంటికి ఇంపుగా అహాన్ని ప్రదర్శించే..



-కొప్పుల ప్రసాద్
9885066235

## నది - నడక

ఆటల పాటల పిల్లల్లరా
నవ్వులు విరిసే పూవుల్లారా
బంగరుభవిత బాలల్లారా
చిన్ని పాటల కోయిలలారా.

చల్లని గాలిని పిలవండి
మేఘాల వైపు పంపండి
చల్లగాలికి మేఘం కరిగేను
చిటపట చినుకులు కురిసేను.

కొండ కోనల వానలు పడేను
పొలము బయలు తడిపేను
చినుకు చినుకు కలిసేను
దారగ కిందికి పారేను.

దారలు దారలు కలిసేను
పెద్ద కాలువలయ్యేను
కాలువలన్నీ కలిసేను
వాగు వంకగ మారేను.
వాగులు వంకలు ఏకమై
సెలయేరులా ఉరికేను
ఉరికే నీటి గలగలలే
నదిలా ప్రవాహమయ్యేను.

చిన్న నదులు కూడుకొని
మహా నదిలా ఉప్పొంగేను
ఒంపు సొంపుల పరుగులతో
సముద్రంలో లీనమయ్యేను.

నీటి ప్రవాహం పారువరకును
నీటి కరువును తీర్చేను
భూగర్భ జలమును పెంచేను
నది వెంట నగరాలు పుట్టేను.

అక్కడక్కడ ఆనకట్టలు
తాగు,సాగునీరునిచ్చేను
విద్యుత్తు ఉత్పత్తి చేసేను
మానవాళినుద్ధరించేను



-ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

## సైనికుడా వందనం

గడ్డకట్టే చలిలో
మండే ఎండల్లో
తిండి తిప్పలు లేక
పీకలలోతు వరదల్లో
ఎప్పుడూ అప్రమత్తంగా
శత్రువుల గుండెలు చీల్చడానికి
సరిహద్దు రక్షణలో దేశమాత సేవలో
అపాయాల వెంట
మందుపాతరల ముంగిట్లో
విష సర్పాల చెంత
కాపలాకాసే "ధీరుడు".

నిద్రలు మాని
అలుపెరుగక
తాగే నీరు దొరకక
పగలనకా, రాత్రనకా
ఎల్లప్పుడూ గస్తీ కాచే మన "జవాన్".
దేశం లోపల , బయట
ఉగ్రమూకల దాడులను తిప్పికొడుతూ
ఉన్మాదుల దుశ్చర్యలను అడ్డుకుంటూ
శత్రుదేశాల ఆక్రమణలను అరికడుతూ
కుటిల రాజకీయ పన్నాగాలను
పటాపంచలు చేస్తూ
వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షిస్తూ
తుఫాను బీభత్సంలో
సర్వంకోల్పోయిన అభాగ్యులను
కాపాడుతూ
మనచే ఎన్నుకోబడ్డ నాయకులను
మన ప్రజా సంపత్తిని
కనురెప్పలా కాపాడే సైనికుడా
నీకు వందనం..



-రామడుగు వేణుగోపాల్
97455930441

## అప్రమతంగా ఉందాం !

కరోనా వైరస్
కొత్త రూపము దాల్చి
మళ్లీ విజృంభించ పోతోందట
ప్రపంచ దేశాలుఉలిక్కి పడుతున్నాయి
టీకా వేసుకున్నావ్ సరే
మళ్లీ కరోనా వచ్చే
అవకాశం ఉందట !
కేసులు తగ్గుముఖం పట్టినవని
నిర్లక్ష్యం చేయకండి.
మన ఆరోగ్యంమన చేతుల్లోనే ఉంది.
నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే నిన్ను ముంచేస్తోంది
జాగ్రత్త సుమా !!
"ఒమిక్రాన్ " పేరుతో మళ్లీ
భారత దేశానికి వస్తే....
మనమిప్పుడు చేయవలసింది ఒక్కటే.......
డాక్టర్లు చెప్పే.......
నిబంధనలు పాటించడమే !
పరిసరాల పరిశుభ్రత
భౌతిక దూరం,మరవకుండా మాస్కులు
ధరించి పాటించడమే....మన కర్తవ్యం.
కరోనా మూడో దశపై
అప్రమత్తంగా ఉండడమే !.
కరోనాను ఎదుర్కోవడం
మనకు కొత్త కాదు
అయినా జాగ్రత్త...
జాగ్రత్త.. జాగ్రత్త.
నిర్లక్ష్యం చెస్తే ఫలితం
మనకు తెలిసిందే కదా !.



- రస స్రవంతి -9290215858
-కావ్యసుధ - 9247313488

## నానీలు

ముదిమి అంటే
ముసలితనం కాదు
ఎన్నో
అనుభవాల నిధి.

తనువును తాకింది
పిల్ల తెమ్మెరలు
పరవశించి పోయింది
హృదయం.

నిన్నటి
బాల్యపు గుర్తులు
ఎప్పటికీ
అమృత జ్ఞాపకాలే.

అక్షరాలే
కవి సేద్యం
కవి భావనలే
సాహిత్యపు తోట



-చాపలమహేందర్
9949864152

## నవ్వే ఔషధం

ఆరోగ్యాన్ని పంచే అక్షయపాత్ర
అంటువ్యాధిలా వ్యాపించే..
అందరి అమూల్య బంధువు
ముఖాన విరబూసిన నవ్వు !

చిరునవ్వు వికసించిన పువ్వు
సుగంధాలను పంచే నెలవు
సూర్యోదయ అరుణ కాంతి వోలె..
ఆరోగ్య సౌభాగ్య ప్రదాయిని !

విచారాన్ని మదిలోంచి తోచేసి..
క్రియాశీలతకు పెద్ద పీట వేసి..
నమ్మకానికి కొమ్ముకాస్తుంది సదా
నొప్పిని హరించే అద్భుత హాసం !

ఏకాగ్రతను మోసుకొస్తూ..
యవ్వనాన్ని ముఖాన నిలిపే..
దరహాస అఖండ దీప వెలుగు
మానవాళికే దక్కిన వరం నవ్వే !

ఒత్తిడి తగ్గించే దివ్య ఔషధం
గుండెకు విరామమిచ్చే లేపనం
సౌంధర్యాన్ని పెంచే సాధనం
దూరమైతే బతుకే బహుభారం !

నవ్వు నాలుగు విధాల మేలు
ఎకిలి నవ్వులే హీనుల బాణాలు
పరిహాస నవ్వులే కడు నీచాలు
నవ్వులు నువ్వులైతేనే విబేధాలు !

ఎవ్వరూ కొనలేని అపార సంపద
మూల్యమే లేని అమూల్య కానుక
దుఃఖాన్ని దూరం చేసే అమృతం
పేద ధనిక భేదమెరుగని చిరునవ్వు !



-మధుపాలీ
9949700037

## జర భద్రం కొడుకో

నీ చుట్టూ నిరాశావాదులు
ఈర్ష్య అసూయపరులు
కాలు లాగేవారు
నువ్వు క్రిందపడితే నవ్వడానికి
తయారుగా వుంటారు
సమయం కొరకు
ఎదురుచూస్తూనే వుంటారు .
నువ్వు నీ పయనం సాగించు
నువ్వు నమ్మిన సిద్ధాంతం మరువద్దు
జీవితంలో ఎత్తుపల్లాలు స్వీకరించు

జరిగిన పొరపాట్లను అదికమించు
అందరిలో కలిసిపోయే ప్రయత్నం ఆపొద్దు
అందరినీ పలుకరించే గుణం మార్చొద్దు
ఉన్నతమైన ఆలోచన ఆపవద్దు
భూమిపై ఉన్నన్నిరోజులు
మంచి జ్ఞాపకాలను పెంచు
మనదగ్గర ఏది ఉంటే అదేఇవ్వగలం కదా !!
జర పయిలం కొడుకో ...



-రామదుగు వేణుగోపాల్
97455930441

## పిల్లలు..తల్లిదండ్రులు

తల్లిదండ్రుల చూసి పిల్లలు..
భయపడేలా చేసుకోకండి..
క్రమశిక్షణను నేర్పుకుంటు...
ప్రేమను పంచెలా చూసుకోండి..

భవిష్యత్తులోనా మనకు..
బాసటగుండెలా చేయండి..
బతుకు దెరువు చూపించి వాళ్ళను..
బాధ్యతగుండెలా మార్చండి..

అక్రమ మార్గములో నడిస్తే..
ఆనాడే పిలిచి మందలించండి..
మనసు నొచ్చుకుంటుందనీ..
చూసి చూడనట్టుండకండి..
ప్రేమానురాగాలు పంచుతూ..
ప్రేమించేలా చేసుకోండి..
ముందు తరాల వారికి వీళ్ళు..
ఆదర్శంగుండెల చేయండి..

మనం నేర్పిన పాఠాలన్నీ..
బతుక్కావలి గుణపాఠాలు..
నడిపించిన బాటలన్నీ..
కావాలి సక్రమ మార్గాలు..



-పసుల.శంకర్
9542181301

## కర్షకుడే జన సింధువు

అందరమూ పుడమి బావి నుండి
నీటిని తోడుకుంటాం
దాహం తీర్చుకుంటాం
రైతు ఒక్కడే పుడమికి
తిరిగి నీటిని అందించి
తన అనుకున్న భూమి ఆకలిదాహం
తీరుస్తుంటాడు-
రైతు పుడమికి చెల్లించిన
స్వేదం మూల్యానికి ప్రతిఫలంగా
ఆహారం తోడుకుంటాడు
తన గురించే కాదు
సకల జనావళి క్షేమం కోసం
అందరి ఆకలి కడుపులో
చల్లని చల్ల అవుతాడు
కత్తి కోతను అడ్డుకుంటాడు
విశ్వవ్యాప్తం అయిన వాడు.



-మాధవీసనారా
8639491246

## మానసిక చికిత్స

ప్రారబ్ధ కర్మ ఫలితమో
పరిసరాల ప్రభావమో
వంశపారంపర్యమో
వశంకాని ఆలోచనల
పర్యవసానమో మనశాంతి కరువై
మనోవేదన షురువై
మనోవ్యాధికి గురై మనసు మంచమెక్కితే
మానసిక చికిత్స
అత్యంత అనివార్యమే..

మూఢనమ్మకాలతో
తాయత్తులు,బలిదానాలంటూ
భూత వైద్యుల వెంటపడి
వెల్లకిలా పడకుండా
మరో మాట లేకుండా
మనోవ్యాధి నిపుణులను సంప్రదించి
సూచించిన మందులు వాడించి
వారిలో మనోధైర్యాన్ని నింపితే
మళ్లీ మామూలు వ్యక్తులుగా
మనుగడ సాగించగలరు..

మనోవ్యాధికి మందులేదనే
పాత సామెతను పాతరేసి
ఆధునిక వైద్యంను ఆశ్రయిస్తే
మనోవ్యాధి మటుమాయం
జీవితం ఆనందమయం...



-బస్వ రాజ్ కుమార్
9392006080

## బుర్రలో బురద...

ఈర్ష్య చూపులను ఆభరణంగా ధరిస్తే
కనురెప్పలపై నిద్ర ఎలా వాలుతుంది
కుళ్ళు కత్తులు కడుపులో దువ్వుతుంటే
అజీర్తి తప్ప ఆరోగ్యమెలా వెల్లివిరుస్తుంది
అసూయ నర్తకితో ఆడిపాడుతుంటే
బుర్రలో బురద తప్ప మరేం పారుతుంది మిత్రమా...!

నీతి నిజాయితీలను దండెం మీద ఆరేసి
స్వార్థపు తోలు కప్పుకుని వెచ్చగా ఉండాలంటే
అగ్ని రవ్వలు రగలకుండా ఉంటాయా
నిన్ను,నీ ఆలోచనలను దహించకుండా ఉంటాయా.

మనస్సాక్షి తీగను ఒక్కసారి లాగి చూడు
నేస్తమా ముసురుకున్న చీకట్లు తొలగిపోతాయి
జీవితపు సజీవ చిత్రానికి కొత్త రంగులద్దుతాయి...
మనసు తోటలో ఆనందపు మిణుగురులు ఎగురుతాయి
మరణపు అంచున కూడా మందహాసమై విచ్చుకుని
అస్తమించని సమీరాలై నిత్యం పూస్తుంటాయి.

తెల్లటి సీతాకోక చిలుకలు తనువంతా వాలుతాయి
వేలాడే గబ్బిలాలు మెదడు నుంచి దూరంగా ఎగిరిపోతాయి
బ్రతుకు ఓడ ఎల్లలు దాటి రేవును చేరుకుంటుంది
కంటి వాకిట్లో నిద్ర పిట్ట ప్రశాంతంగా వాలుతుంది.

-శ్రీతరం
7893613015

# అప్పుడు "వెన్నెల కన్నీరు", ఇప్పుడు అక్షరాల కన్నీరు...!



గత నాలుగు దశాబ్దాలకు పైగా సాహితీ, సాంస్కృతిక రంగాల్లో ఎనలేని సేవలందిస్తున్న కార్యకర్త, కావ్యకర్త కిన్నెర సంస్థ వ్యవస్థాపకులు శ్రీ మద్దాళి రఘురాంగారు 'అక్షరాల కన్నీరు' పేరుతో ఓ కవితా సంపుటిని వెలువరించారు. కిన్నెర పబ్లికేషన్స్ ద్వారా 130కిపైగా గ్రంథాలను ప్రచురించిన అనుభవమున్న ఆయన స్వయంగా 1981లో 'వెన్నెల కన్నీరు' కవితా సంపుటిని ప్రకటించి కవిగా సాహితీ లోకంలో తమకంటూ ఓ గుర్తింపును సాధించారు. **'తూకానికి కన్నీళ్లు'** కవితా సంపుటిని కూఆ లోగడ వెలువరించారు. ఇప్పుడు 'అక్షరాల కన్నీరు' పుస్తకాన్ని మనకు అందిస్తున్నారు. కిన్నెర చిత్రనిర్మాతగా పది మంది తెలుగు జీవిత చరిత్రలపై డాక్యుమెంటరీలను నిర్మించి ఆయన నాలుగు నంది అవార్డులను పొందటం విశేషం.

2012లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆవిష్కృతమైన 1200 మంది రచయితల బయోడేటాలతో 'తెలుగు రచయితల డైరెక్టరీ'కి సంపాదకత్వం వహించారు.

తెలుగు కిరణం. తెలుగు ప్రముఖులు తెలుగువారి గుండెల్లో గుమ్మడి అక్కినేని అభిమానిగా సినారె అభిమానిగా వంటి ప్రచురణలతో అందరి మన్ననలు అందుకున్న మద్దాళిగారు ఎంత ఎదిగినా ఒదిగి వుండే సంస్కారాన్ని సొంతం చేసుకున్నారు.

ఇప్పుడు వెలువరించిన **'అక్షరాల కన్నీరు'** కవితా సంపుటిలో 38 కవితలకు చోటు కల్పించారు. వైవిధ్యమైన అంశాలను తమ కవితా వస్తువులుగా ఎంపిక చేసుకుని తమదైన శైలిలో భావ ప్రకటన చేశారు. ముఖ్యంగా వివిధ రంగాల్లో వెలుగొందిన కొంతమంది ప్రముఖులతో తమకున్న అనుబంధాన్ని అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

చిన్ననాట అమ్మనాన్నలు అక్షరాభ్యాసం చేసిన సన్నివేశాన్ని కవి మద్దాళిగారు చక్కగా దృశ్యమానం చేస్తూ 'అక్షరాల కన్నీరు' కవితను తీర్చిదిద్దారు. అక్షరాలు అటూ ఇటూ పేర్చితే మాటలవుతాయని.. ఆ మాటలు మాట్లాడితే భాష అవుతుందని.. పెద్ద బాలశిక్ష చది వింది గుర్తుందనీ.. నా బాల్యం కరిగిపోయి నా తనయుడి దగ్గరికి చేరింది.. అక్కడా కరిగిపోయి.. నా మనుమడి దగ్గరకు చేరిందని కవి తమతో పెనవేసుకున్న తెలుగు భాష పరిణామక్రమాన్ని ఈ కవితలో ఏకరువు పెట్టారు. కాలంతో పాటు ముచ్చట్లు కరిగిపోయాయని కవి వాపో యారు. ఇప్పుడు ఓనమాలకు పలకా- బలపం అవసరం లేదని అన్నీ ప్యాడ్‌పైనే అంటూ చమత్కరించారు. ఇక చెర పడం లేదు- స్వైప్ చేయడమే అంటూ వ్యాఖ్యానించారు. జాతి పురాతనమే అయినా భాషలో మాధుర్యం ఏది? అని ప్రశ్నించారు. తెలుగు-ఇంగ్లీషు భాషగా మారి తెంగ్లిడ్‌గా తెలుగు సంకరమవుతున్నదని తమ ఆవేదనను వ్యక్తపరిచారు. తెలుగు భాషాదీపం కొడిదటుకు పోకుండా ఇకనైనా అందరం కలిసికట్టుగా కాపాడేందుకు అప్రమత్తం కావలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. అందరం కలిసి తెలుగు భాషకు ఊపిరిపోసి ఉనికిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

**'సాంస్కృతిక గంగ'** శీర్షికతో రాసిన కవితలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి గారిని ఉన్నతంగా ఆవిష్కరించి వారి పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

కె.వి. రమణాచారిగారు నదిలా కనిపిస్తాడని.. ఆయన చిరునవ్వు ఎందరికో అభయ హస్తమని.. అందరూ దేవుళ్ళను పూజిస్తే- హరిదాసు మాత్రం ఆయనకు నమస్కరిస్తారని కొనియాడారు. ఆయనకు వచన రచన లోని మర్మాలు తెలుసు.. పద్యధార తెలుసు.. పాటగా ప్రవహించడమూ తెలుసూ అంటూ కె.వి. రమణాచారి గారికి వారి సప్తతి వసంతవేళ అక్షర చందనం సమర్పించుకున్నారు.

**'స్నేహతోరణం'** కవితలో మన తలపులో విస్తరించిన మైత్రి వనం ద్వారా బంధాలకు ఎప్పటికీ వాడిపోని పచ్చతోరణాలు కడదామని తమ 45ఏళ్ల నేస్తం విజయకు మార్కు అంకితమిస్తూ ఓ కవితను రాశారు.

శార్వరి ఉగాది పర్వదిన సందర్భంగా రాసిన కవితలో కాస్త, ఆలస్యంగా రా.. శార్వరి అని వేడుకున్నారు. కాస్తంత ఓపిక పట్టు.. మహమ్మారిని మసి చేస్తాం.. నీ కోసం కొత్త స్వాగత గీతాలు రచిస్తాం.. రణం ముంగిట తోరణాలు చేపడతాం అంటూ కొనసాగించిన తీరు బాగుంది.

లాక్‌డౌన్ నేపథ్యంలో రాసిన **'పల్లె చెప్పిన పాఠం'** కవితలో మూడు తరా ల ఉమ్మడి జీవనానికి పల్లె ఆనందపు లోగిలి అనీ ప్రకృతి వైపరిత్యంలోనూ పల్లె పాఠం చెప్పిందని.. కలయికలో సుఖాన్ని విప్పి చూపిందని పేర్కొనడం బాగుంది. ఇక ఇప్పుడింక భయం లేదు. ఇంట గెలిచాం.. రచ్చ గెలుస్తామన్న ధీమాను ప్రకటించారు.

వృద్ధురాలైన ఓ తల్లి ఆవేదనను తెలియజెపుతూ.. **వృద్ధాప్యం శాపమా! వరమా!** అన్న కవితను రాశారు. ఈ కవితలోని ప్రతి పంక్తీ మనల్ని కదిలించేలా కొలువుదీరింది.

తోటమాలి స్వగతాన్ని ఆవిష్కరిస్తూ రాసిన కవిత విలక్షణంగా మలచబడింది.

భారతీయ సంస్కృతి ఏకసూత్రమై ఆకాశవాణి నిత్యం ధ్వనించాలని అభిలషిస్తూ రాసిన కవిత బాగుంది. ఆకాశవాణి అమరవాణియై అనంత కాలం ప్రతిధ్వనించాలని ఈ కవితకు మంచి ముగింపునిచ్చారు.

అమ్మ కోసం తపనపడే బాల బాలికలకు అంకితమిస్తూ 'నిశ్చలవాణి' కవితను రూపుదిద్దారు.

సాహిత్య చరిత్రకారుడిగా.. వ్యాసకర్తగా.. విమర్శకుడిగా, కవిగా, రూపకర్తగా భాసిల్లిన డా॥ ద్వా.నా. శాస్త్రి గారిని అక్షర హారికుడుగా అభివర్ణిస్తూ ఓ కవితను రాశారు.

దాశరథిని కవితల పయోనిధిగా.. పేర్కొంటూ మరో కవితను ఇందులో పొందుపరిచారు.

నీవు ఉత్తరాంధ్రకు మాత్రమే పరిమితంకాదు. యావదాంధ్ర జాతికి రత్నదీపమంటూ.. గురజాడను అక్షరాల వెలుగువాడగా అభివర్ణించారు.

భావ కవితా మేస్త్రీగా పేర్కొంటూ డా॥ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిపై... అక్షరాల హరిచందనం అంటూ వీణా విద్వాంసులు మంచాల జగన్నాథ రావుగారిపై.. మౌన సముద్రం అంటూ పి.వి. నరసింహారావుగారిపై, సారస్వత గగనంలో ధ్రువతార అంటూ ఆరుద్రగారిపై.. తెలుగువారి విశ్వకవిగా అడవి బాపిరాజుగారిపై వెయ్యినవలల లోగిలి అంటూ కొవ్వలిపై రాసిన కవితలు ఈ సంపుటికి నిండుశోభను కూర్చాయి.

ఇంకా **'రెప్పపాటు ఆనందం'.. "కుటుంబం ఓ పూల పందిరి".. 'పలకరింపు' 'నమస్కారం' 'దృశ్యం చెప్పిన కావ్యం' 'స్వేచ్ఛాభారతికి మరో విజయం'** శీర్షికలతో మద్దాళిగారు రాసిన కవితలు ఆలోచనాత్మకంగా మలచబడ్డాయి.

ఇలా కవి మద్దాళి రఘురాంగారు వివిధ కవితా వస్తువులపై కవితలు రాసి అందరినీ మెప్పించారు. వస్తు విశ్లేషణతో పాటు శిల్పం అభివ్యక్తి శిల్పం వంటి అంశాలపై మరింత దృష్టి సారించి ముందు కవితలు రాస్తారన్న నమ్మకం ఉంది.

**ప్రతులకు:**కిన్నెర పబ్లికేషన్స్
ప్లాట్ నెం.101, మద్దాళి గోల్డెన్‌నెస్ట్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ
బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్-13.
సెల్: 986605



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## చేరనీయకు...చేరనీయకు

చేరనీయకు...చేరనీయకు

నీ పంచన నవ్వించి నమ్మించి
నట్టేటముంచే నయవంచకుల్ని...

దూరనీయకు...దూరనీయకు
నీ కళ్ళల్లోకి రౌద్రాన్ని
నీ చేతుల్లోకి రాక్షసత్వాన్ని
నీ మాటల్లోకి క్రూరత్వాన్ని
నీ బ్రతుకులోకి దారిద్ర్యాన్ని
నీ అంతరంగంలోకి అరిషడ్వర్గాల్ని
నీ తలపుల్లోకి భయాన్ని నిరాశావాదాన్ని...

పారనియ్యకు...పారనియ్యకు
పాదరసం లా
నీ పాదాల్లోకి...పిరికిదనాన్ని...

చల్లారనీయకు...చల్లారనీయకు
నీ ఎదలో ఉప్పొంగే ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని...

మారనీయకు...మారనీయకు
నీ సద్బుద్ధిని మంచితనాన్ని మానవత్వాన్ని...

జారనియ్యకు...జారనియ్యకు
నీ చేతుల్లోనుండి అందిన
బంగారు అవకాశాల్ని...

కోరనియ్యకు...కోరనియ్యకు
ఆ పరమాత్మను శాశ్వతమైపోవాలని
నీ శరీరాన్ని...

ఊరనియ్యకు...ఊరనియ్యకు
నీ మదిలో ఉద్రేక పూరిత
ఉన్మాద భరిత వెర్రి ఊహల్ని...



-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## "అక్షరాలే బుల్లెట్లు"

వారు..కలాలను సిరాలతో నింపుకొని

అక్షరాలను కాగితాలపై కక్కుకొని
కవిత్వం, సాహిత్యం ఇదేనంటూ
శీర్షికల పేరెట్టి శిరస్సు ఎగిరేసినోల్లు కాదు
సన్మానాలకు తలల్ని వంచినోల్లు కాదు
చరిత్రహీనులై నిలిచినోల్లు కాదు.

వారు..మెదల్లను
ఆశయాల ఆయుధాగారాలను చేసి
పెన్నులను గన్నులుగా మార్చి
అక్షరాలను బుల్లెట్లుగా చేసి
రాజ్యహింసను ప్రశ్నించినోల్లు
అరాచకాలను నిలదీసినోల్లు
చరిత్రను సృష్టించినోల్లు

నిన్న, నేడు, రేపు..కాలమేదైతేనేం
రాచరికమా, దొరతనమా, పెత్తనమా
వ్యవస్థ ఏదైతేనేమి
మనిషిని మనిషి దోచుకునే తత్వాన్ని
కుల-మతాల ముసుగేసుకొని

అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని
ప్రజల్ని వంచించినప్పుడల్లా
కలాల్లో గళాల ఘర్జనల నింపి
నిలదీసెటోల్లు..
నిజాయితీని బ్రతికించడానికి
ప్రాణాలను ఫణంగా పెట్టి
ప్రజాస్వామ్య పరిరక్షణకై
అనునిత్యం పోరాటం సలిపేటోల్లు

ఒక్కరా, ఇద్దరా..ఎందరైతేనేమి
సామాన్యుడి పక్షమై నిలిచిన
కవిమిత్రులు ఎవరైతేనేమి
చరిత్రకెక్కినా, ఎక్కకున్నా
వారి కలాలు మాత్రం నిత్యం గన్నులై
కుతంత్రాల దేహాల్లో
బుల్లెట్లను దింపుతునే ఉంటాయి
కలుషిత సమాజపు ఆనవాళ్ల
హద్దులను చెరిపేస్తూనే ఉంటాయి



-డా॥ పాక
వెంకటేశ్వర్లు
9849436891

## నానీలు

జోరీగలై
రొదపెడుతున్నాయి
నువ్వొదిలెళ్ళిన
జ్ఞాపకాల ఆనవాళ్లు.

స్వప్నమై
తారాడుతున్నాయి
కనుపాప కాన్వాసుపై
జ్ఞాపకాల కుంచెలు

నిశికొమ్మన
జ్ఞాపకాల సౌరభాలు
వేకువపిట్టను
తరిమే ధ్వానాలు

చూపులో
కానరాదు నీరూపం
గుండెలో దీపమై
వెలిగింది నీ జ్ఞాపకం

స్వప్నాల వీధిలో
సారంగ సరాగం
మీటింది
నీ జ్ఞాపక సమీరం

జ్ఞాపకాల పుటలు
తెరుచుకున్నాయి
ఏకాంత పుస్తకం
నను చేరగానే

గుప్పుమంది
జ్ఞాపకాల గులాబి
ఒంటరి కొమ్మ
పల్లవించినంతనే.

జ్ఞాపకాల వారధి
కడుతున్నా
మౌనాన్ని చీల్చి
మాటలను అతికిస్తూ

మౌనరాగం
మదిని మీటింది
జ్ఞాపకాలే
సరిగమలవగా



-అయిత అనిత
8985348424

## పుస్తక సమీక్షలు

# కథలతో కథాకళి





తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' వారి ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ సంకలనంలో 111 కథానికలున్నాయి. వ్రాసిన వారందరూ రచయిత్రులే కావటం మరో విశేషం. 'ప్రమదాక్షరి' అన్న సాహితీ బృందం మహిళలలో సాహిత్యాభిరుచిని పెంపొందించటానికి ముఖ పుస్తకంలో ఏర్పడిన ఓ గ్రూపు. ప్రచురణకర్త జ్యోతి వలబోజు (జె.వి.పబ్లికేషన్స్) చొరవ తీసుకుని, ఒపికగా బృందంలోని సభ్యురాండ్ల నుండి సేకరించి అందిస్తోన్న కదంబమాల "కథాకేళి". ఇందులో చేయి తిరిగిన రచయిత్రులున్నారు. ఇప్పుడిప్పుడే రాస్తున్నవారు, మొదటిసారి తమ 'కలంబలం' చూపించిన వారు కూడా ఉన్నట్లు విశదం అవుతోంది.

కథల్లో రచయిత్రులు ఆవిష్కరించిన ప్రపంచాన్ని గమనిస్తే ఇన్ని సమస్యలుం టాయా? అనిపిస్తుంది. ఇదే కాదు. ఈ సమస్యలకు ఇన్ని కోణాలుంటాయా? అని ఆశ్చర్యం వేస్తుంది.

అయితే, కథలన్నింటా రచయిత్రులు కనబర్చిన ఆశావహ దృక్పథం ఎంతగానో అభిలషనీయం. ఆనందా యకమూను. ఒక రచయిత్రి మాత్రం స్త్రీ స్వాతంత్ర్యానికి అర్హురాలు కాదన్న నిస్పృహతో ముగించకుండా ఉంటే మరీ బావుండేది. కథల్లో యదార్థత, సహజత్వం ఉండాలి. ఇది ఎవరూ కాదనలేని నగ్న సత్యం. 'నల్లమబ్బును చూసినప్పటికన్నా, ఆ నల్లమబ్బుకు జరీ అంచు పొదిగితే కనిపించే మనోజ్ఞిత మరింత ఆనందదా యకంగా ఉంటుంది. సాహిత్యం సమాజ హితం చేకూర్చితేనే బంగారానికి పరిమళం అద్దుకున్నంత అందంగా ఉంటుంది.

రచయిత్రులు వెలయించిన కథలు కనుక, సింహభాగం కథలు కుటుంబ సంబంధాలు, దంపతులపై ఒకరినొకరి కుండాల్సిన అనురాగం, ప్రేమ, సంతానం, వారివల్ల వచ్చే సమస్యలు, చిన్ని పిల్లలను సాకటంలోఆడవారు పడే, వారికే అన్వయించబడే ప్రత్యేక ఇబ్బందులు, అన్నా తమ్ముళ్ళు, అక్కా చెల్లెళ్ళ మధ్య ఉండే పరస్పర ప్రేమలు, ఎవరి సంసారాలు వాళ్ళకు ఏర్పడ్డాక మారిపోయే మనఃస్తత్వాలు వీటి మధ్య నలిగిపోయే గృహిణుల జీవితాలు, అందరూ బాగా వివరించారనిపిస్తుంది. మరో 'యూనిక్' కథా వస్తువు వృద్ధాశ్రమం లో దంపతులెదుర్కొవలసిన ఆశ్రమ జీవితం. 'డబ్బో.. డబ్బు' అని వెంపర్లాడే రామారావు (మంచితనం మానవత్వం-కథ) చివరకు నలుగురికి సాయం చేకూర్చగలిగే గీతాశ్రమం ఏర్పాటు చేస్తాడు. ఎవరికీ భారం కాకూడదు అనుకున్న దీప తల్లి స్వగ్రామంలో ఉన్న శాంతి సేవా శ్రమం (పయనం)లో శేష జీవితం గడపాలని నిర్ణయించుకుంటుంది. అమ్మ వీలునామా కథలో రామేశ్వరిగారి నిర్ణయమూ, ఇదే! మరో కథాంశం- ఇద్దరూ ఉద్యోగులే అయిన భార్యాభర్తల తీరూ ఇదే! 2020 ప్రాంతంలో వ్రాసిన కథలు కనుక కోవిడ్, లాక్‌డౌన్ ఆ సమయాన చూపించాల్సిన మానవత్వం గురించి 'లాక్‌డౌన్'. మరియు 'భయం' కథలు చెప్పాయి. ఆ సమయంలో కరోనా బాధితులకు సాయం చేసే వారిలో దేవుడు కనిపిస్తాడు. రేడియోలో ప్రసార మవుతోన్న సంభాషణ విని 'రేడియోలోకి మనుషులు ఎట్లా దూరుతారు' అని అమాయకంగా ఆశ్చర్యపడ్డ లక్ష్మి, పట్టుదల, సహకారం ఆసరా చేసుకుని డా॥ లక్ష్మి కాగలుగుతుంది. 'దటీజ్‌లక్ష్మి'లో. హాస్పిటల్స్, మరో చోట-ఏదైనా-మనిషి దీనావస్థలో ఉన్నపుడు 'నీకేం కాదు. మంచిగ పండుకోమ్మా' అనే చెయ్యందించిన నర్స్ చేతిస్పర్శ కొండంత బలం ఇచ్చింది 'స్పర్శ' కథలో. ఇలాంటి కథలపై, విషయాలపై రచయితలు / రచయిత్రులు తమ దృష్టిని కేంద్రీకరించగ లిగితే, తెలుగు కథావారసత్వం అంతులేని సంపద కలదిగా అవుతుంది.

మరో సమకాలీన విషయం మీద వచ్చిన కథ 'రక్షణ'. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'షీటీం' ఆవశ్యకతను వివరిస్తుంది ఈ కథ.

కుటుంబానికి కనబడని గొడుగు వంటివాడు నాన్న అని 'నాన్న కానుక' మరియు 'పితాదేవో మహేశ్వర' కథలు వివరిస్తాయి.

హాస్య కథలు వ్రాయటంలోనూ మేమేమీ తీసిపోలేదు అని నిరూపించారీ రచయిత్రులు. 'ఏవీ రావూ.. ఎల్కాపిలా మరియు కాయావకాయ' కథలతో.

హద్దుల దాటిన సంబరాలు అందునా అరువు తెచ్చుకున్న 'బర్త్ డే బంప్స్' లాంటి వేడుకలు ప్రాణాంతకంగా మారుతాయని 'దీపాన్ని వెలిగించండి' కథ చెబుతుంది.

ఏది ముఖ్యం- పరువా? ప్రాణమా? లాంటి కథల్లో తంగిరాల మీరా సుబ్రహ్మణ్యంలాంటి పరిణతి చెందిన రచయిత్రులు కథలోనూ, కథనంలోనూ తమ Maturity ని చూపించారు.

క్రొత్త రచయిత్రులైనా- మంచితనం మానవత్వం, సేవా దృక్పథం ఉన్నంత కాలం సృష్టిలో ఏ వ్యక్తీ అనాథకాదు (పే.53), నాకే హక్కులు ఉన్నాయి మీకు లేవు అని బ్రతకటంలో ఏమి ఆనందం ఉంది? కుటుంబం అంటే నా నుంచి మన అనే దాంట్లోకి మారటం (పే.71). మనిషి యంత్రంలా మారితే, మనిషిని యంత్రం తోనే నడిపించాల్సిన రోజులొచ్చాయి (పే.105). జీవితం అంటే కష్టాలు, పరిష్కారాలు మాత్రమే కాదు. మన కిష్టమైన వాళ్ళతో పొందే అనుభూతులు ఆనందాలు కూడా (పే.114) లాంటి వాక్య నిర్మాణాలు పాఠకుడిని ముగ్ధుడిని చేస్తాయి.

మేమే కాదు, మా కథలు కూడా చేయందిస్తే రాణిస్తాయి. సౌరభాలు వెదజల్లుతాయి అని నిరూపించారు ఈ 111 రచయిత్రులు. వ్రాసిన రచయిత్రు లకు, కథలతో కథాకళి చేయించిన ప్రచురణ కర్త జ్యోతి వలబోజుకు అభినందనలు.

ప్రతులకు:జ్యోతి వలబోజు
సెల్: 80963 10140.



- కూర చిదంబరం
సెల్: 8639335675

## చెట్టే జన్మించాలి

రోజురోజుకు తరిగిపోతున్నవి తరువులు
ఆగమాగం అయితున్నవి మన బతుకులు
పుడమిని స్వచ్ఛంగా సహజంగా నిలిపేవి
కలిమి బలిమినీ మనకిచ్చి నడిపించేవి
కాలంతోపాటే మనిషి కాలయముడైతున్నడు
పచ్చదనాన్ని చంపేస్తూ
నేల ఉసురును పులుముకుని
తన గోతిని తానే తీసుకుని
భవిష్యత్తు లేకుండా
విశ్వనాశనానికి తానో సమిధౌతున్నడు
కాలుష్యం ఓవైపు కోరలుచాస్తూ
ప్రతాపం చూపెడుతున్నది
ఓజోన్ నేడో డేంజర్ జోన్
సూర్యతాపానికో మాడిమసైపోతున్నడు
తలుచుకుంటే ప్రకృతి కోపానికి
ఆహుతులెందరో
ధరణి నేడు విపత్తులతో అతలాకుతలం
అంతుచిక్కని రోగాలొకవైపు దాడి
ఆక్సిజన్ అందక గాల్లో దీపాలైన ప్రణాలు
సహజత్వం నశించి
ప్లాస్టిక్ పువ్వుల పరిమళాలే ఎక్కడైనా
కృత్రిమ మేధస్సు ఎంత పెంచుకున్నా
చివరకు అంతా తుస్సే
నాట్లేసే పొలాల్లో
ప్లాట్లేస్తున్నరు
చెట్టు చేమల్ని మాయంజేస్తున్నరు
గాలాడని మేడల్లో బతుకుపయనం
మనిషే ఓ చెట్టై జన్మించాలిపుడు



-సి. శేఖర్(సియస్సార్),
9010480557

## జలజం - ఒక జీవనది

సంగీతమైనా సాహిత్యమైనా
శాస్త్ర విజ్ఞానమైనా లోకజ్ఞానమైనా
నిరంతర కృషితో సాధ్యమయ్యే
భగీరథ యత్నాలే
సులభ సాధ్యమయ్యే పనులేవీ
చరిత్రలో నమోదుకునోచుకోవు
అలుపెరుగని ఆరాటంలో
ఆవిర్భవించే అత్యద్భుతాలే
ఒక జీవితకాలంలో సఫలీకృతమైన
ఆవిష్కారాల పరంపరలే
బహుముఖీయ ప్రజ్ఞాపాటవాల
సృజనశీలత కాలం కొలనులో విర బూసిన
మనోజ్ఞ మందారాలు
ఒక అవిశ్రాంత పథికుడి
ఆలోచనలతరంగాలే
అమృతం చిలికే భావుకత మనోవీచికలే
సాధన వేదనలో సుసాధ్యమయ్యే
సంరంభాలే
జీవన కడలిలో ఒప్పొంగిన అలల తాకిడి
రాటుదేలి మేలిమి బంగారమైన
భావావేశాలు
పదాల కూర్పులో వెదజల్లిన
రసానుభూతులు
సుదీర్ఘ మనో మథనంలో పారిన
సాహితీ చెలిమెలు
విభిన్న సాహితీ ప్రక్రియల్లో
వినూత్న ఒరవడులు
కాల నాళికలో ప్రవహించే
జీవన పార్శ్వాలు
ప్రపంచానికి పంచిన మేధో పరిమళాలు
అజ్ఞాన తిమిరల్ని హరించే
దివ్య మూలికలు వెరసి
జలజం ఒక ఎత్తైన శిఖరం
జీవన పోరాటంలో తపించి
తీరం చేరిన యోధుడు అతడు -
కలకాలం కాలానికి ఎదురీదే ఒక జీవనది
జలజం కానరానిలోకాలపయనం
నాలోని అయోమయం స్మృతిపథం

- కే.లక్ష్మణ్ గౌడ్
9704930509

## శిశిరగీతంలో వసంత రాగం!

మాఘమాసం
ముడివేసింది వాళ్ళిద్దరిని
శ్రీకారంచుట్టింది కలల కాపురానికి

మొట్టమొదలే
అవాంతరం జడలు విరబోసుకుని
ఆయన మనసులో ఒక ఆలోచన పురుడుపోసుకుని
ఆమె కలికివలపుల వాకిళ్ళలో
తిష్ట వేసింది అమాస నిశీథం
ఇరువురిమధ్యఏర్పడింది పెను అగాధం
ఆ అగాధం బంగాళాఖాతంగా మారి
ఇరువురి బ్రతుకుల్ని నిండా ముంచింది
ముసలవ్వ సేవలోఆయన ఇక్కడ
ముసలి నాయనకు ఊతకర్రగా ఆమె అక్కడ
ఏ ముద్దుముచ్చటకు ఆశలేదు
ఏ కోరికా తీర్చడానికి చెంత ఆమె లేదు
అంటార్కిటికా ఖండం దీర్ఘరాతిరిలాంటి విరహాలు వాళ్ళు
కలుసుకోలేని రైలుపట్టాల సమాంతర జీవితాలు వాళ్ళు

వృద్ధాశ్రమాల్నిగాని
తాడుతో వ్రేలాడదీసే లంచ్ బాక్సుల్ని గాని
ఫోనులోనుండి మందులను గుర్తుచేసే
మోడ్రన్ మమతల్నిగాని
నాలుగు గోడల నడుమ నలిగే శుష్కవేదనల్నిగాని
కాదనుకున్న వాళ్ళు
కన్నవాళ్ళఒంటరి ఆఖరిమజిలీని కాస్తంత
హరితమయం చేస్తున్న వాళ్ళు
కళ్ళ ముందుండి మనోధైర్యాన్ని నింపి
ముదిమి జీవితాల్ని ఆనందమయంగా మలుస్తున్న వాళ్ళు
ఆయనకు ఒక పాప ఉంది
ఆమెకు ఒక బాబు ఉన్నాడు
ఇది శిశిరగీతంలో వసంత రాగం
దగ్ధహృదయం మీది వెన్నెలజలపాతం
ఆ ముసలివాళ్ళు మంచానికే అంకితం
కాలు కదపలేకున్నాగాని వాళ్ళు
స్వర్గంలో తప్పక కలుసుకుంటారు
అపుడైనా వీళ్ళు కూడా కలుసుకుని
జీవిస్తారేమో బహుశా జీవితాంతం
అపుడు కదా కథ సుఖాంతం.



-రమేశ్ నల్లగొండ,8309452179

## ఐదు (అం)తరాలు

తాతల వాహనాలు జత కాళ్ళు
నాన్న వాహనాలు సైకిల్ గిర్రలు
నా వాహనం మోటారు స్కూటరు
కొడుకు కూతురు కారులో షికారు
విమానంలో మనుమడి విహారాలు !

తాత నివసించె గుడిసె గూట్లో
నాన్న నివాసం చిన్న పెంకుటింట్లో
స్లాబ్ రూంలో తెల్లారింది నా బతుకు
మార్బుల్ ధగధగల్లో కుమారుడి నివాసం
డిజిటల్ ఏసి మేడలో మనుమడి దర్జాలు !

తాత వస్త్రాలు తిపాగ దోతులు
చేనేత పట్టు వస్త్రాలే నాన్న వస్త్రాలు
పాలిస్టర్ ప్యాంటు షర్టులో నేను
బూట వర్క్ అద్దాల్లో నా కూతురు కోడలు
చిరిగిన టైట్ జీన్స్‌లో మా మూడోతరం !

కట్టెల పొయ్యి పొగలో నాన్నమ్మ వంటలు
కిరోసిన్ స్టౌవ్‌తో అమ్మ కుక్కింగు కుస్తీలు
గ్యాస్ స్టవ్‌తో నా వంటల తంటాలు
ఓవెన్, ఫ్రై పాన్‌లో కొడలి కమ్మని వంటలు
బర్గర్ పిజ్జాలకే మనుమడి ఎదురు చూపులు !

సున్ను పిండితో తాతనాన్నమ్మ తానాలు
సబ్బు నురగతో నాన్న తరం స్నానాలు
పీయర్స్ సోపులే మా తరం సోకులు
లిక్విడ్ సోప్‌తో కొడుకు కోడలి స్నానాలు
ఫేస్ ప్యాక్‌లకే మనుమరాలి మక్కువలు !

తాత తరంలో ఉమ్మడి కుటుంబాలు
నాన్న ఇంట్లో తోటి కోడళ్ల కొట్లాటలు
మా ఇంట్లో ఉన్నది భార్య పిల్లలు
కొడుకు ఏక సంతాన న్యూక్లియర్ ఫామిలీలు
మనుమడి తరం స్మార్ట్ ఫోన్‌తో ఏకాంతాలు !

ప్రయాణంతో చుట్టాలను చుట్టే తాతలు
నాన్న పయనాలు ఎడ్ల బండ్ల వాహనాలు
ఉత్తరాలు రాసె నా తరం కుశల వార్తలు
కొడుకు కోడలు ఈ-మెయిల్ ఉత్తరాలు
మనుమడు మునిగెను సోషల్ మీడియా !

తాత తరం రాతి లోహ యుగమైంది
అయ్య తరం హరిత యుగమైంది
నా తరం పారిశ్రామిక ప్రగతైంది
కొడుకు కాలానికి కంప్యూటర్ వచ్చింది
మనుమడి చేతిలో డిజిటల్ విప్లవముంది !

-మధుపాలీ
9949700037

## తెలుగు తేట తియ్యదనం

దేశభాషలందు తెలుగు లెస్స, అని ఎందుకు అన్నారో తెలుసా?
తెలుగు భాషకి తెగులు పట్టకుండా, తెలుసుకొని నింపుకుందాం మన యేదలనింద!
తెలుగు అనేది కాదు ఓ యాస, అదోక తేట తేనె తియ్యని బాషా!
తెలుగు అనేది కాదు ఒక జాతీ, అదోక తారాలనాటి సంస్కృతి!
తెలుగు అనేది కాదు ఒక గాథ, అదోక తరిగిపోని సిరిసంపద!
తెలుగు అనేది కాదు దండగా, అది ప్రతిరోజు జరుపుకునే పండుగ!
తెలుగు అనేది కాదు అధికారం, అదోక అందంగా అల్లిన అలంకారం!
తెలుగు అనేది కాదు స్థానికత, ప్రపంచానికి చాటి చెప్పే చరిత గల ఘనత
తెలుగు అనేది కాదు వృథ, అది వినమృడై ఇచ్చే మర్యాద!
తెలుగు అనేది కాదు రచన, నిన్ను అమ్మగా లాలించే రక్షణ!
తెలుగు అనేది కాదు కవిత్వం, నీ వ్యక్తిత్వాన్ని తెలిపే మంచి లౌకితత్వం!
తెలుగు అనేది నడక, అది సుమార్గం చూపే నడవడిక!
తెలుగు అనేది కాదు రాజ్యం ఏలే విజయప్రదా!
అది రాజ్యాంగంచే గుర్తింపు పొందిన అధికార హోదా!
తెలుగు అనేది కాదు ఏ భాషకంటే తక్కువ,మాతృభాషపై పెంచుకో మక్కువ!
తెలుగు అనేది ఎన్నో శాసనాల పునాది, ముందు తరలకోసం పలుకుదాం నాంది!

-పల్లె రాజుగౌడ్, 9666207288

## ఒక చిన్నిదీపం...

గుండెలోని నాలుగు గదులన్నీ
చీకటి మేఘాలను కమ్ముకున్నాయి.
రోజులన్ని కళ్లులేని దేహాలై గడుస్తున్నాయి.
ఆశయాలన్ని అంధకారంలో చిక్కుకొని..
గమ్యంలేని గాలిపటాలై ఎగురుతున్నాయి.
బతుకు నిత్యం సుడిగుండాల...
కష్టాల కడలిలో చిక్కుకొని కదలాడుతుంది.

ఇప్పుడొక చిన్నిదీపపు వెలుగు కావాలి.
అనునిత్యం అంతరంగాన్ని అన్వేషిస్తూ..
ఎదలో నన్నుతట్టిలేపే ఒక ప్రేరణ కావాలి.
మోడుబారిన వృక్షాలు మళ్ళీ చిగురిస్తున్నట్లు..
హృదయంలో పట్టుదలను మొలిపించే
ధైర్యం కావాలి.
జీవితపు దారిపొడవునా నన్ను ఆహ్వానించే..
రహదారిలాంటి ఒక విజయపు దారి కావాలి.

జారిపడుతున్న కలలన్నీ ఇపుడు...
గుప్పిటపట్టుకొని..
శ్రమజీవపు రెక్కలు తొడుక్కొని..
ఆకాశం అంచున ఎగిరే పక్షినై సాగాలి.
చిన్ని దీపపు వెలుగురేఖలను..
కాగడాల్లా మలుచుకొని చీకటి పొరలను
చీల్చుకొనిపోయే మిణుగురులా సాగిపోవాలి.
నిశీధికమ్ముకున్న విశ్వాన వెలుగులు
విరజిమ్మే తారాజువ్వనై వెలిగిపోవాలి.

ఆగిపోయిన జీవితపు కాలాన్ని..
మళ్ళీ పరుగులుపెట్టించి..
షిఫ్ట్ పక్షిలా దూసుకుపోవాలి.
ప్రశ్నిస్తున్న కాలానికి..ఒంట్లో నరాలన్నీ బిగబట్టిన
పిడికిలిలామారి..విజయపు తోరణాలతో
స్వాగతం పలకాలి.
రేపటి స్వప్నాలను ముడేసుకొని నడుస్తున్న కాలాన్ని

బానిసగా చేసుకొని.. పేదరికపు గాయాన్ని
పట్టుకొనే వలవిసిరి..గెలుపుదరికి చేరాలి.
ఇన్నాళ్లు చీకటి గదిలో చిక్కిన జీవితానికి..
ఉషోదయపు రవికిరణాల వెగులు కావాలి.



-అశోక్ గోనె
9441317361

# జ్వాలా రవ్వలు

మంచు కరిగిన జలధారలో
పిచ్చుక పిల్ల, తలంటు స్నానం చేసి
ఉదయం ముఖం మీద చిట్టి రెక్కల పరచి
జీవన ప్రపంచంలోకి ఎగిరిపోయింది
తల్లి ఒడివిడిచి తానే తనకు తోడై జ్వాల.

మనిషిలా వాడి రాలిపోతానని తెలిసి కూడా
మొగ్గ తొడిగిన బాల పుష్పం
యవ్వనంలో నిలబడి పరిమళిస్తుంది
మృత్యువుపై చిరునవ్వుతో జ్వాల.

రేపు తిరిగి వస్తానని
ప్రమాణం చేసిన సూర్యుడు, వీరుడిలా
వెన్నెల ఒడిలో సేద తీర్చుకుంటుడు
కాల మొబ్బుల రాత్రులు
అప్పుడప్పుడు భయపెట్టిన
వాడు అమృతం త్రాగిన అగ్ని శీలుడు కదా!
నమ్మకం వమ్ము చేయక వస్తాడులే జ్వాల.

పసివాళ్లు బోసినవ్వుల తోటకు
విత్తనాలు పరిస్తే, చిగురించిన నవ్వులలో
విషం నింపుకున్న మనుషులు
పసివాళ్లు కాలేకపోతున్నారురా జ్వాల.

కుక్కలు వున్నాయి జాగ్రత్త
బోర్డు తగిలించుకున్న ఇంట్లో
కుక్కలు వుండగా ఏమి వుంటాయిరా జ్వాల.

పాము పడగ మీద ముద్దుపెట్టి
తన్మయత్వం పొందె తారలు

జింకను తింటున్న పులి మూతిని
ఎందుకు నాకుతున్నట్లు
ఓ.. రసానుభూతికారుడు,
రహస్యం చెబుతాడులేరా జ్వాల.

స్పర్శ కోల్పోయి భూతల్లి
రక్త ముద్దలతో ఏ.. అనుభూతి వెతుకుంటుంది
పుత్రిక శోకం ఇంకా తీరలేదు ఏమోరా జ్వాల.
ప్రేయసికి ముద్దు పెట్టడానికి, తహతహలాడుతున్న
ప్రేమికుడు, రహస్య స్థావరం వెతుకుతుంటుండు!
ఎందుకు.. లోపల మైదానం వుంటే చాలదా
ప్రేమికుడికి రా జ్వాల..

ముద్దుకు నిర్వచనం అమ్మను అడుగు చెబుతుంది.
అప్పుడప్పుడు అడవిని అడుగు
అడగలేక గుండె చప్పుల్లో దాచుకున్న ప్రేయసి
అంతఃమ్ములాన్ని కూడా అడుగు
లోపల తడి ఆరకుండా వుంటేనేరా జ్వాల.

తెల్ల గుర్రం నడుముకు
నల్లనాగు బెల్టులా చుట్టుకోని
పడగవిప్పి బుసలు కొడుతుంది
కాలం కలుషితం కాక
ఏమి అవుతుంది రా జ్వాల..



-జనజ్వాల
సెల్:994916377,
9100737416 (వాట్సప్)



## 'భారత దేశంలో రైతు ఉద్యమాలు' ఆవిష్కరణ



రైతు ఉద్యమనాయకుడు సారంపల్లి మల్లారెడ్డి రచించిన 'భారతదేశంలో రైతు ఉద్యమాలు (1757-2021 వరకు)' పుస్తకం ప్రజాశక్తి మాజీ సంపాదకుడు వినయ్‌కుమార్ ఆవిష్కరించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ అన్నదాతల ఉద్యమాలకు చేయూత నిచ్చేలా పౌర సమాజం సమాయత్తం అవ్వాలని పిలుపునిచ్చారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ, 90 పేజీల ఈ పుస్తకంలో 300 ఏళ్ల చరిత్రను అక్షరబద్ధం చేసిన సారంపల్లి అభినందనీయుడని అన్నారు. కార్యక్రమంలో బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, కవి తంగిరాల చక్రవర్తి, డి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## లాల్-నీల్ ఐక్యత అవసరం-సీనియర్ జర్నలిస్టు సతీష్ చందర్



దేశంలో లాల్, నీల్ ఐక్యత అవసరమని సీనియర్ జర్నలిస్టు సతీష్ చందర్ అభిప్రాయపడ్డారు. జి. రాములు రచించిన 'నీలం రంగు ఎరుపు' వ్యాస సంపుటిని ఆయన శాతవాహన వర్సిటీ ఆచార్యులు సూరెపల్లి సుజాత బుక్‌ఫెయిర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. కవి తంగిరాల చక్రవర్తి మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు కేవీపీఎస్ కార్యదర్శి స్కైలాబ్ పాల్గొన్నారు.

## ఏపీలో కొత్తగా 10 ఒమిక్రాన్ కేసులు

అమరావతి, డిసెంబర్ 29: దేశవ్యాప్తంగా రోజురోజుకు ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్నాయి. అలాగే తెలుగు రాష్ట్రాల్లోనూ ఒమిక్రాన్ కేసులు ఎక్కువవుతున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా 10 ఒమిక్రాన్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఏపీలో ఒమిక్రాన్ కేసుల సంఖ్య 16కు చేరుకుంది. కువైట్, నైజీరియా, సౌదీ అరేబియా, యూఎస్ నుంచి వచ్చిన వారికి ఒమిక్రాన్ పాజిటివ్ వచ్చింది.

## 'మహనీయుల జీవిత చరిత్ర' ఆవిష్కరణ



వెనకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిందు ఎల్లమ్మ వేదికపై 'గాడ్గేబాబా', 'ఛత్రపతి శివాజీ', 'వీరబ్రహ్మేంద్రస్వామి', 'బిందేశ్వర్ ప్రసాద్ మండల్ సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాలను పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. నిర్వాహకుడు, రచయిత ఇంద్రవెల్లి రమేశ్ కృషిని ప్రశంసించారు. ముఖ్య అతిథి ఆచార్య ఇనుకొండ తిరుమలి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కొండూరు వీరయ్య, సీనియర్ కవి డా॥ నాళేశ్వరం శంకరం, ఇఫ్లూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్, రచయిత ఇంద్రవెల్లి రమేశ్ పాల్గొన్నారు.

## 'అనురాగ మూర్తులు-పుల్లయ్య-శాంతకుమారి'



శనివారం బుక్‌ఫెయిర్‌లో క్రియేటివ్ లింక్స్ ప్రచురించిన 'అనురాగ మూర్తులు-పుల్లయ్య శాంతకుమారి' పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కథా రచయిత జగన్నాథశర్మ మాట్లాడుతూ పుస్తక రచయిత ఓలేటి శ్రీనివాస్ భాను ఔన్నత్యాన్ని కొనియాడారు. ఆంధ్రజ్యోతి నవ్య వీక్లీలో ప్రచురితమైన పుల్లయ్య, శాంతకుమారి జీవిత విశేషాలు పుస్తకంగా రావడం సంతోషకరమన్నారు. సీనియర్ నటి శాంతకుమారి మనుమడు చక్రిలోకప్రియ, పరిశోధకుడు రెంటాల జయదేవ, రచయిత ఓలేటి శ్రీనివాస్‌భాను, క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్ నిర్వాహకుడు సూరిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పుల్లయ్య శాంతకుమారిల కూతురు, కుటుంబ సభ్యులు క్రియేటివ్ లింక్ బుక్ స్టాల్‌ను సందర్శించారు.

## జీవీఆర్ ఆరాధన ఉత్తమ పురస్కారాలు



ప్రముఖ న్యూస్ చానల్ 'ఏబిఎన్-ఆంధ్రజ్యోతి' యాంకర్‌కు జీవీఆర్ ఆరాధన ఉత్తమ పురస్కారం బహూకరించారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ వారు తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' యాంకర్ మీనలాపురం సరితకు బహూకరించారు. శుక్రవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రభుత్వ సలహాదారు డా॥కేవీ. రమణాచారి ప్రదానం చేశారు.

## ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంగీత సమ్మోహనం శీర్షికతో నిర్వహించిన 'సినీ సంగీత విభావరి' ఆకట్టుకుంది. శుక్రవారం ఉదయం త్యాగరాయ గానసభలో సంస్థ అధ్యక్షుడు, వ్యాఖ్యాత పీఎంకే గాంధీ సమర్పణలో నిర్వహించారు. గాయనీ గాయకులు ఖైరి శ్రీనివాస్, బాల లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యం, రవిమన్యు, చంద్రశేఖర్, ప్రసాద్, రామ్మూర్తి, రాధాకృష్ణ, సుబ్బిరెడ్డి, సీవీరావు, ఫణి, నర్మద, జ్యోత్స్న తదితరులు గీతాలాపన చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తిని గాయనీ గాయకులు సన్మానించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 408వ రోజు 'ఆశ-దురాశ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఆశ-దురాశ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా - సంపాదకులు



*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &*
*దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
*ఏకాంశ కవిత్వం నిర్వహణ:*
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** *9441046839*

## విచిత్ర మానవులు

ఆశ లేనిదే
జీవితం లేదు
ఎన్నో ఆశలు
మనుషుల చుట్టూ వై ఫైలా
ఎన్నో ఆలోచనలూ అవసరాలూ
అనుబంధాలూ ఆత్మీయతలూ
పెంచుకోవాలి
నేటి చిత్ర పరిస్థితుల్లో
ఆశ - దూర ఆశగా మిగిలి
దురాశ పెరిగి
మంచి నుంచి దూరంగా పోయినా
జీవితమే మనుషుల ను ఆకర్షిస్తూ
ఆకాశం అందుకునే పరుగు
ఎన్నో జీవితాలు
ఆశా దురాశ ల మధ్య
వ్యామోహం అంచులు చేరి
ఆశ పెరిగి పెరిగి
మానవత్వపు విలువలు కోల్పోయి
దురాశ వల్లే
ఎన్నో రకాల వింత విచిత్ర ప్రవర్తనలు
అశాంతిమయ జీవితాలు
ఓ మనిషీ!
నీ జీవిత గమ్యం
నీ శాంతియుతమైన ఆలోచనే
ఇది కూడా ఆశే కదా!.



**- నారుమంచి వాణీ ప్రభాకరి**

## మరిచిపోకు

సృష్టిలో మహోత్కృష్ట ప్రాణి మనిషి
ఆశ లేకపోతే
మనిషి మనుగడే లేదు
అత్యాశకు పోతే అధోగతి పాలే
విజ్ఞానాన్ని పొందాలన్నా
అత్యున్నత శిఖరాలు ఎక్కాలన్నా
ప్రతి పనిలో విజయం సాధించాలన్నా
మనలో నిండుకున్న అజ్ఞానాన్ని ఛేదించి
జ్ఞాన కుసుమ పరిమళాలకై ఆశపడాలి.
మలిసంధ్యలో
ముడుచుకున్న రవికాంతిని
నవ్యమైన భవ్యోదయ కిరణాలను
చూడాలంటే
రేపటి ఉషోదయానికై
మదినిండా ఆశతో ఎదురుచూడాలి.
కాళోజీ సందేశాన్ని మదినుంచుకోవాలి
ఉదయం కానే కాదని నిరాశ వద్దు
ఉదయించి అట్లానే ఉండాలనే
దురాశ కూడా వద్దు.
స్వార్థపూరిత పోటీపడుతూ
దురాశా పరుడవై పయనిస్తే
నిట్టనిలువునా కూలిపోక తప్పదు
గెలుపే లక్ష్యంగా పయనించకు
విలువలతో కూడిన గెలుపే
శాశ్వత ఆనంద మూలం
అత్యాశకో దురాశకో పోతే
అథః పాతాళమే గతి
న్యాయంగా ధర్మంగా ఏది కావాలో
నిశ్చయంగా తెలుసుకుని ముందడుగు వేస్తే
ఆశయాల ఆశలు సొంతం
కనబడ్డ ప్రతి దానికీ ఆశ వద్దు
వినిపించే ప్రతిసవ్వడి
సొంతం కావాలనుకోకు
ఆశపడు..
తప్పులేదు
కానీ..
దురాశ దుఃఖానికి చేటని మాత్రం
మరిచిపోకు.



**-పత్తెం విజయ రాఖీ**

## అసంతృప్తి

ఆశ లేని మనిషికి అభివృద్ధి శూన్యం
ఆశ అత్యాశ గా మారితేనే అసలు తంటా
దురాశ దుఃఖానికి చేటు-
అనాది నుండీ అందరూ అంగీకరించే సత్యం
అయినా మనిషి ఆలోచనల్లో
మార్పు రానితనం.
మనిషి సంఘజీవి
సమాజంలో అందరూ
సమానం అనుకున్నప్పుడే
సుఖమూ శాంతీ అభివృద్ధీ
నేను-నాదని, మేము-మాదని అనుకోవడమే
మనిషి పతనానికి నాంది.
న్యాయమైన లాభాలతో
అధిక సంపాదనకు ఉండదు ఆస్కారం
అత్యధిక లాభాలతో
పేదల కొంప కొల్లేరు చేయడం
మిలియనీర్లు కావడమే ధనికుల లక్ష్యం.
ఆశ నుండి అత్యాశ
అత్యాశ నుండి దురాశ
దురాశ స్థితి కూడా దాటితే
మోసాలూ దుర్మార్గాలూ
దోపిడీలూ దొంగతనాలూ
హత్యలూ ఆత్మహత్యలూ.
వందేళ్లు పైబడి బతికేది ఏ కొందరో
జీవితకాలం సంతోషంగా బ్రతికించేది
డబ్బో అధికారమో పదవులో కాదు
పేదవారిపై దయ
వారి నాణ్యమైన జీవితానికి చేయూత
మంచిపనులు చేసినప్పుడు కలిగేది సంతృప్తి
లక్ష్యం లేని దుబారా ఖర్చులతో
మిగిలేది అసంతృప్తి.



**-నాగిరెడ్డి అరుణ జ్యోతి**

## అక్షర లక్షణం!

అక్షరం లో లక్షణం విలక్షణం!
ఆశ దురాశ పేరాశ నిరాశ
పదాల అర్థాలు ఎన్నెన్నో!
ఆశలు ఆశయాలు లేకుంటే
ఉండదు పురోగతి!
ప్రగతిబాటలో నడవాలి జగతి.
చిన్నిచిన్ని ఆశలు
నెరవేరని జీవితాలు కొన్ని!
చేయూతనిచ్చినా సాగవు అన్నీ.
ఆశ అడియాసగా మారితే
బతుకు అమావాస్య
ఆశలావు పీకసన్నం ఉంటే కష్టం!
ఆశపడి పాసిన అన్నంతింటే
పాడుపడి పది లంఖణాలు -సామెత నిజం!
ఆశలేని కూటికి ఆకలిలేదు
చిన్నినా పొట్ట శ్రీరామరక్ష
ఉన్నదంతా నాకే అంటే
ఇతరుల మంచి
మనం బాగుపడాలనుకోటం
పేరాశకీ దురాశకీ పరాకాష్ఠ!
కుండలోని నీటికై రాళ్లు వేసి
కాకి తీర్చుకునే దాహం!
పులి చేతి బంగారు కంకణం కోసం
దురాశపడి అర్పించే ప్రాణం!.
ఆశ ఊరించు!
కార్యసాధనకై తపించు!
దురాశ నిలువునా కొంపముంచు!.
ఐదూళ్లు పాండవుల కివ్వని
కౌరవులు సర్వ నాశనం!
కృష్ణునిపై నమ్మకం ఆశతో
పాండవుల విజయం!
దురాశ దుఃఖానికి చేటు!
హితం మితం ఉన్న ఆశ
సాధనతో జయం
శాంతీ తృప్తీ!.

**-ఎ.రాజ్యశ్రీ**

## అనాదిగా ఉన్నదే

నక్కకు నాగలోకానికి ఉన్నంత దూరం
ఆశకు దురాశకు మధ్యనున్న వ్యత్యాసం
మనిషిని శిఖరాగ్రానికి చేర్చగలదు ఆశ
పయనిస్తే మనిషి ఉన్నత ఆశయాల దిశ
ఆశ మార్చగలదు
మనిషి స్థితిగతుల దశ.
దురాశ దుఃఖానికి చేటన్నది ఆర్యోక్తి
దురదృష్టవశాత్తు గుర్తుంచుకోదది ఏ వ్యక్తి
తృప్తిలేని నేటి వ్యక్తిని ఆవరిస్తుంది అత్యాశ
ఉరుకుతోంది జీవితం గొంతెమ్మ కోరికల దిశ
నువ్వే కల్పించాలిక మనిషికి సద్బుద్ధిని ఈశా!
ఆశతో చిగురుతొడుగు ఆశయం
దురాశతో చెలరేగు దానవత్వం
సదాశయం మనిషికి అలంకారం
దురాశ మనిషికి ముళ్ల మకుటం.
ఆశ, ఆశయం సంఘాన్ని నడుపు ఆయుధం
ఆశ, అత్యాశ సంఘ శ్రేయస్సుకు శరాఘాతం
నేర్పితే పిల్లలకు సంప్రదాయం, భక్తిభావం
ఏర్పడు మత్సర మాలిన్యరహిత సమాజం
ఇలాతలం కాగలదు భూతలస్వర్గం.



**- జె.వి.కుమార్ చేపూరి**

## శక్తికి మించొద్దు

అంగడి
ముచ్చటైన
చిత్రమైన
బతుకు అంగడి
ఆశలకు గాలం వేస్తూ
ఇచ్చును రేకెత్తిస్తూ
సత్తువ మరచి
తాహతు విడిచి
ఆశించే ఆశ
కొలబద్ద ఉన్న
కొలత సహించని
కోరికల జీవితం
కోరుకున్నదంతా
దురాశే...
శక్తిని చూసి ఆశిస్తే
ఆశ ఆశయాన్ని
చేరుతుంది...
శక్తికి మించిన ఆశ
దురాశై
జీవన పోరాటం
అపహాస్యమవుతుంది.



**- జె.నరసింహారావు**

## దురాశ లేకుంటే..

ఆకాశమే హద్దుగా ఎదగాలనే
ఆశ మనిషిలో
అడుగులు సైతం వేయలేకున్నా
ఆకాశం అందుకోవాలని
శ్రమ పిడికెడంతైనా
గిరిశిఖరాన్ని చేరాలనే ఆశ
పెట్టుబడులు పిసరంత
లక్ష్యాన్వేషణ విశ్వమంత!.
ఆశలేకుంటే
జీవితం ప్రేరణ లేని నడక
సాధించాలనే ఆశ లేకుంటే
గమ్యం లేని చలనం
ప్రేమించి సాధించాలనే ఆశ
వివిధచర్యలకు మూలం
పనిలో విజయమనే ఆశ
నవీన దారుల అన్వేషణ!
బ్రహ్మర్షి కావాలనే ఆశ లేకుంటే
విశ్వామిత్రుడే లేడు
విశ్వవిజేత కావాలనే ఆశలేకుంటే
అలెగ్జాండరే లేడు
సాధించాలనే ఆశ లేకుంటే
ఐన్ స్టీనే లేడు
ఆశలేకుంటే
మనిషి జీవితమే లేదు!.
ప్రతి మనిషికి ఒ ఆశ
సౌఖ్యజీవనం గడపాలని
ప్రతి మనిషికి ఒ ఆశ
తనే అగ్రగామి కావాలని
ఆశే మనిషిని నడిపిస్తోంది
ఆశే మనిషిలో
పోటీతత్వాన్ని పెంచేది!
శక్తిని కలిగి ప్రయత్నం ఫలించే
ఆశ అభిలషణీయం
నైపుణ్యాలు లేక అంతరిక్ష గమనమనే
ఆశ దురాశ
పైసా లేకుండా
ప్రపంచాన్ని జయించడం దురాశ
అక్షరం రాకుండా
అనంతాన్ని జయించడం దురాశ!
ఆశలు ఉండాలి అందరికి
ఆశయ సాధనకై
ఆశలు కోరికలు లేకుంటే
జీవితం అసంపూర్ణం
దురాశలు దుఃఖ హేతువులు
పతన లక్ష్యపు నడకలకు దురాశ హేతువు!
దురాశతోనేగా
కామధేనువు కావాలనే కౌశిక వాంఛ
దురాశ లేకుంటే
ఆరాటాలు పోరాటాలు లేనే లేవు
ఈర్ష్యలు లేవు
అసూయలులేవు
దురాశ లేకుంటే
దుఃఖదాయకమైన జీవితం లేదు!.



**- లక్ష్మా రెడ్డి పసుల**

## నాలుగు స్తంభాలాట

ఆశ మనిషి సహజ లక్షణం
అవసరం మనుగడ కి
ఆశ లేనిదే సంకల్పం లేదు
సంకల్పం లేని ప్రయత్నం
ప్రయత్నం లేని కార్య సఫలత లేదు
ఆశించింది పొందితే
మెండైన ఆత్మవిశ్వాసం
తృప్తిలేని జీవికి
పెరుగుతాయి కొత్త ఆశలు
అధికమైన ఆశ అత్యాశ
అత్యాశతో అథః పాతాళమే..
ఆశ తృష్ణ గా మారితే
బ్రతుకు పెడదారే..
అత్యాశకి పైమెట్టు దురాశ
దురాశ దుఖానికి చేటు
అని తెలిసినా ఎదుటివాడికి
హాని కలిగించక మానడు..
ఆశ మనిషిని బతికిస్తే
దురాశ మనిషిని
మనిషిగా చంపేస్తుంది.
తాను బాగుండాలని
కోరుకోవటం ఆశ
తాను మాత్రమే
బాగుండాలనుకోవటం అత్యాశ
తన బాగుకోసం ఇతరులని
బలిచేయ్యాలనుకోవటం దురాశ..
వివేకంతో కూడిన
ఆశ నెరవేరుతుంది.
అవివేకంతో కూడిన
ఆశ నిరాశకి దారి తీస్తుంది.
మనిషి మనుగడ
నాలుగు స్తంభాలాట
ఏ స్తంభం ముట్టుకోవాలో
మన వివేకం చెప్పాలి
మనం వినాలి.



**- మోటూరిశాంతకుమారి**

## మంచి మనుషుల లక్షణం

అచంచల విశ్వాసం
అలుపెరుగని ప్రయత్నం
ఆశల సాకారానికి మూల ధనం !
అవసరం మేరకే ఆశించడం
అందరికీ ఫలం దక్కాలనుకోడం
మనిషిలో పరిపూర్ణతకు నిదర్శనం !.
అప్పనంగా పొందాలనుకోవడం
అంతా తనకే దక్కాలనుకోవడం
మనిషిలో దానవత్వ లక్షణం !.
దురాశతో దుర్మార్గాలు చేయడం
దురహంకారంతో ధర్మం మరవడం
మనిషి పతనానికి మూల కారణం !.
ఆశ, దురాశల విచక్షణ
మనుగడ, పతనాల విశ్లేషణ
మంచి మనుషుల లక్షణం !.



**- రామకృష్ణ చంద్రమౌళి**

## 'సర్వమత సమధర్మం వివేకానంద స్వామి సందేశం' ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సనాతన సమధర్మ ప్రచార పరిషత్, చినుకు కల్చరల్ సొసైటీ, తెలుగు వెలుగు కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఎస్.వెంకట్రావు రచించిన సర్వమత సమధర్మం వివేకానందుడి సందేశం పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పరిషత్ అధ్యక్షుడు విజయశంకరస్వామి మాట్లాడుతూ బెంగాల్‌లో ఒక సాధారణ సన్యాసిగా ప్రారంభమైన ఆయన జీవితం ఆ తర్వాత తనదైన ముద్రతో స్వామి వివేకానంద ప్రపంచ మేధావిగా నిలిచారన్నారు. సామాజిక వేత్త సి.రమేష్‌రెడ్డి, తెలుగు వెలుగు కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీరాందత్తి, సినీ నటి సుచరిత, రచయిత బండి సత్తన్న, నీరాజరెడ్డి, ఎన్. గిరినల్లా తదితరులు పాల్గొన్నారు.

## సినీ పాటకు సాహిత్య వాసనలు అద్దిన సిరివెన్నెల



సినీ పాటకు సాహిత్య వాసనలు అద్ది సామాన్యులకు చేరువ చేసిన సిరివెన్నెల రూపం లేకపోయినా ఆయన రాసిన పాట దృశ్యంగా నిలిచి ఉంటుందని ప్రముఖ సినీ గీత రచయిత డా॥ సుద్దాల అశోక్‌తేజ అన్నారు. త్యాగరాయ గానసభలో వంశీ ఆర్ట్ థియేటర్స్, శుభోదయం, గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సిరివెన్నెల పాటకు పట్టాభిషేకం పేరిట ఆయనకు స్వర నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ గాయని సురేఖామూర్తి దివాకర్ల, గాయకులు వినోద్‌బాబుకు సిరివెన్నెల సీతారామశాస్త్రి స్వర్ణ వంశీ-శుభోదయం సంగీత పురస్కారాలను బహూకరించి సత్కరించారు. వంశీ సంస్థల వ్యవస్థాపకులు డా॥వంశీ రామరాజు స్వాగతం పలికిన సభలో సుంకరపల్లి శైలజ, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాలు

సాహితీ రంగంలో, పాత్రికేయ రంగంలో విశేష సేవలందించిన వారికి ఏటా అందించే అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాలను సాహిత్యానికి ప్రసాదమూర్తి, పాత్రికేయానికి ఎం. నాగేశ్వర్‌రావు స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ జనవరి 2, 2022 ఉ 10.30 గం॥లకు ప్రెస్‌క్లబ్, సోమాజీగూడ, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో అల్లం నారాయణ. కె. శ్రీనివాస్‌లు అరుణ్ సాగర్ స్మారకోపన్యాసం చేస్తారు. జూలూరు గౌరీశంకర్, కట్టా శేఖర్ రెడ్డి, గోరటి వెంకన్న, సీహెచ్ క్రాంతికిరణ్, కె. శివారెడ్డి, ఘంటా చక్రపాణి, బీఆర్ నాయకుడు పాల్గొంటారు.

## స్నేహ రేఖ

మంచి ముత్యపు రేఖలా - మనుగడకు మార్గం చూపే -
మందార రేఖ - నీ స్నేహ రేఖ
మురిపాల రేఖలా - అందర్నీ అలరించే - మంకెన పూరేఖ - నీ స్నేహ రేఖ
మర్యాద రేఖలా మసలుతూ - మాయపన్లు చేయనివ్వని -
మామిడి పూరేఖ - నీ స్నేహ రేఖ
మృదుల రేఖలా - మది మదిని - దోచేలా చేసే- చామంతి రేఖ - నీ స్నేహ రేఖ

ముద్దమందార రేఖలా - మసలేలా చేసే - మధుర భావాల రేఖ - నీ స్నేహ రేఖ
మమకార రేఖలా - మహోపకారాన్నందుకునేలా చేసే -
కల్పతరువు రేఖ - నీ స్నేహ రేఖ
మయూర రేఖలా మసలుతూ - మంటలు రేప నివ్వని -
గులాబి రేఖ - నీ స్నేహ రేఖ
మమతల రేఖలా - మహోన్నత నందించే - మంజుల రేఖ- నీ స్నేహ రేఖ

మల్లెపూరేఖలా - మమకారాన్ని - మారాకు వేయించే -
మణిమయ రేఖ - నీ స్నేహ రేఖ
మరువపు రేఖలా - మంచి మనసుతో మసలేలా నేర్పించే -
ముత్యాల రేఖ - నీ స్నేహ రేఖ
మధులత రేఖలా - మసలుతూ - మాయపన్లు చేయనివ్వని -
ముద్దబంతి రేఖ - నీ స్నేహ రేఖ
మనోహర రేఖలా - మాన్యతను - అందించే మాలతి రేఖ - నీ స్నేహ రేఖ

మంచి సుమగంధపు రేఖలా - మెలిగేలా చేసి - సుమనస్సు రేఖ - నీ స్నేహ రేఖ
మక్కువ రేఖలా - మదిని మురిపించే - ఆణి ముత్యాల సిరుల రేఖ - నీ స్నేహ రేఖ
మంచి సంపెంగ రేఖలా మసలుతూ - దుమారం రేపనివ్వని -
సింధూర రేఖ - నీ స్నేహ రేఖ
మనిషి - ఎదుట లేకున్నా సరే - నీకు నేనున్నాను గా - అంటూ
అనువణువునా - అభిమానాన్ని
నిండు మనసుతో - రెండు చేతులా - మధుర భావనలతో
నీవుంటే వేరే కనులెందుకు లా - అభిషేకిస్తూ -
పగలే వెన్నెల కాయించే - పారవశ్యపు పరవశాన్ని ప్రసాదించే
ఆత్మీయ రేఖ - నీ స్నేహ రేఖ



**-లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
సెల్: 94404 48650

## పాలపిట్ట సాహిత్య వ్యాసాల పోటీ ఫలితాలు

పాలపిట్ట నిర్వహించిన సాహిత్య విమర్శ, పరిశోధనా వ్యాసాల పోటీలో పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా పరిశోధన ఆసక్తి కలిగిన వారు చాలామంది వ్యాసాలు పంపించారు. అలాగే విభిన్న ప్రక్రియలకు సంబంధించిన విమర్శనా వ్యాసాలు వచ్చాయి. విమర్శ, పరిశోధనల మీద ఆసక్తి తో కృషి చేస్తున్నవారు బాగానే ఉన్నారని ఈ పోటీ తెలియజెప్పింది. బహుమతుల వివరాలు ఇక్కడ ప్రకటిస్తున్నాం.

ప్రథమ బహుమతిః వచన కవిత - శిల్పానుశీలన - ఎం.నారాయణశర్మ
**ద్వితీయ బహుమతిః** వికాసం నుండి విస్తృతి - బి.వి.ఎన్. స్వామి
**తృతీయ బహుమతిః** తప్త హృదయుని మత్స్యగ్రంధి - డా.సిహెచ్. సుశీలమ్మ

**ప్రత్యేక బహుమతులు**

1. ఊహ భంజికలు అల్లిన నవల- మనోధర్మపరాగం - డా. పి. విజయలక్ష్మీ పండిట్
2. తెలంగాణ భావకవితా విద్వన్మణి - నందిగామ నిర్మలకుమారి
3. బహుజనుల కళారూపం -భజన - పిల్లా తిరుపతి రావు
4. అనువాద ప్రక్రియ-సాధక బాధకాలు:ఒక పరిశీలన - వేలూరి కృష్ణమూర్తి
5. సాంఘిక జీవన సమగ్ర వర్ణిక - సింహాసన ద్వాత్రింశిక - డా. బోయిన్‌పల్లి ప్రభాకర్
6. హైకవే సంపుటాలు - కాలాన్ని శ్వాసించే కవిత్వం - మండల స్వామి
7. ఈ దశాబ్ద కవితా ధోరణులు - ఒక పరిశీలన - తాటికొండాల నరసింహారావు
8. తెలుగు సాహిత్యంపై రుబాయిల ప్రభావం - అమ్జద్

- ఎడిటర్, పాలపిట్ట

## కొలకలూరి పురస్కారాలు 2022

కొలకలూరి సాహిత్య పురస్కారాలకు గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. కొలకలూరి భాగీరథీ పురస్కారం కోసం కథా సంపుటి, కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం కోసం నవల, కొలకలూరి రామయ్య పురస్కారం కోసం విమర్శనా గ్రంథాలను పంపగోరుతున్నాం. ఈ గ్రంథాలు జనవరి 1, 2019 తర్వాత ముద్రితమై ఉండాలి. గ్రంథాలను జనవరి 15, 2022లోగా పంపాలి. ఒక్కొక్క పురస్కారానికి రూ.15 వేల నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువా ప్రదానం చేస్తారు. కథానిక సంపుటులు, నవలలు పంపాల్సిన చిరునామా: కొలకలూరి మధుజ్యోతి, తెలుగు శాఖాధ్యక్షులు & పరీక్ష విభాగం డీన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి-517 502. ఆం.ప్ర. ఫోన్: 94419 23172. విమర్శనా గ్రంథాలు పంపాల్సిన చిరునామా: కొలకలూరి సుమకిరణ్, ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-517 502. ఆంప్ర. ఫోన్: 99635 64664.

## బాలల కథల పోటీ

ఉగాది సందర్భంగా సుగుణ సాహితీ సమితి నిర్వహిస్తున్న బాలల కథల పోటీకి సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్, ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.1500, రూ.1000, రూ.500/-, రూ.300/- చొప్పున పది ప్రత్యేక బహుమతులు ఉంటాయి. విద్యార్థులు తాము వ్రాసిన కథలను బిరునామా, కన్వీనర్, ఉగాది కథల పోటీ, ప్రతిభ డిగ్రీ కళాశాల, మెదక్ రోడ్, సిద్దిపేట-502 103. జనవరి 31, 2022లోగా రిజిస్టర్ పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలి. వివరాలకు: 9959007914




ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్ & రాయసం ఫౌండేషన్
ప్రముఖ రచయిత్రి
డా॥ ముక్తేవి భారతిగారికి
శ్రీమతి రాయసం మహాలక్ష్మి పురస్కారం
ప్రముఖ సాహితీ వేత్త
డా॥ వోలేటి పార్వతీశంగారికి
శ్రీ రాయసం సుబ్బారాయుడు పురస్కారం- బహూకరణ
గురువారం 30-12-2021 సా॥ 6 గంటలకు
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్.
ముఖ్య అతిథి
డా॥ కె.వి. రమణ ఐ.ఏ.ఎస్. (ర)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
అధ్యక్షులు
ఆచార్య ఎన్. గోపి
పూర్వ ఉపకులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి
డా॥ సి. భవానీదేవి, ప్రముఖ రచయిత్రి
గౌరవ అతిథి
డా॥ తటవర్తి రాజగోపబాలం, ప్రముఖ రచయిత
అతిథులకు సత్కారం
శ్రీ రాయసం వెంకట్రామయ్య, ఐ.ఆర్.ఎస్. (ర.)
ప్రముఖ రచయిత
సా॥ 6 నుండి 6-45 వరకు డా॥ ఎం.ఆర్.కె. ప్రభాకర్ మరియు బృందంచే లలిత సంగీత విభావరి
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (ర) అధ్యక్షులు, కిన్నెర
ఆర్.యస్.రాయుడు, కార్యదర్శి, రాయసం ఫౌండేషన్
మద్దాళి రఘురామ్, కార్యదర్శి, కిన్నెర


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com